
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తమిళనాడు
TAMILNADU
శనివారం 5 జూలై 2025







వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వ్యవసాయ శాఖ భవనాలను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

ఇళ్ల వద్దకే విత్తనాల కిట్లు

● తోటల పెంపకానికి ప్రోత్సాహం

● పోషక సహిత వ్యవసాయోద్యమం ● ప్రారంభించిన సీఎం స్టాలిన్

చెన్నై, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అవసరమైన కూరగాయల కోసం వారిళ్లవద్దే తోట ఏర్పాటు చేసుకునేలా రాష్ట్రంలో 'పోషక సహిత వ్యవసాయోద్యమం' పేరిట రూ.18.67 కోట్లతో కొత్త పథకానికి ముఖ్యమంత్రి స్టాలిన్ శ్రీకారం చుట్టారు. ఈ మేరకు శుక్రవారం సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో ప్రజలు తమకు అవసరమైన టమోటా, వంగ, బెండ, మిరప, ఆకుకూరల, కూరగాయల కోసం తోటలు పెంచుకునేలా విత్తనాలు కిట్లను అందజేస్తామన్నారు. ఇదే విధంగా త్వరగా పండే బొప్పాయి, జామ, నిమ్మ చెట్లను కూడా ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు.

వ్యవసాయ, పశుసంవర్ధక శాఖల భవనాలు ప్రారంభం...

రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక శాఖల ఆధ్వర్యంలో రూ.125.53 కోట్లతో నిర్మించిన కొత్త భవనాలను ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం జరిగిన కార్యక్రమంలో రూ.103.38 కోట్లతో నిర్మించిన 18 గిడ్డంగులు, 3 వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ కేంద్రాలు, 8 వ్యవసాయ విస్తరణ కేంద్రాలు, 2 విత్తన నిల్వ కేంద్రాలు తదితర భవనాలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం ప్రారంభించారు. తెన్‌కాశి, కోయంబత్తూరు, చెంగల్పట్టు, అరియలూరు, పుదుకోట, విరుదునగర్, కళ్ళకురిచ్చి, తిరువణ్ణామలై, వేలూరు, కృష్ణగిరి, కాంచీపురం, తిరుప్పూరు తదితర జిల్లాల్లో ఈ కొత్త భవనాలను నిర్మించినట్లు స్టాలిన్ తెలిపారు.

ఇదే విధంగా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జరిగిన మరొక కార్యక్రమంలో రూ.25.15 కోట్లతో నిర్మించిన పశుసంవర్ధక పరిశోధన కేంద్రం భవనం, 12 వెటర్నరీ హాస్పిటల్ భవనాలు, 2 జిల్లా పశుసంవర్ధక తదితర భవనాలను కూడా స్టాలిన్ ప్రారంభించారు.పశుసంవర్ధకశాఖ ఉద్యోగుల వారసులకు కారుణ్య ప్రాతిపదికన 208 మంది ఉద్యోగ నియామక పత్రాలు కూడా అందజేశారు.

తిరుచెందూరు క్షేత్రంలో వసతిగృహాలు...

రాష్ట్ర హిందూ దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో జరిగిన మరొక కార్యక్రమంలో తిరుచెందూరు సుబ్రహ్మణ్యస్వామి ఆలయం వద్ద భక్తుల కోసం రూ.10.57 కోట్ల వ్యయంతో నిర్మించి వసతి గృహాలను కూడా ముఖ్యమంత్రి స్టాలిన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. ఈ వసతిగృహాల్లో భక్తులు బసచేసేందుకు 52 గదులున్నాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాలలో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రులు ఈవీ వేలు, ఎంఆర్‌కే పన్నీర్‌సెల్వం, ఎంపీ సామినాథన్, అనితా రాధాకృష్ణన్, పీకే శేఖర్‌బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందం తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలీగ్ నేత ఖాదర్ మొహిద్దీన్‌కు

'తగైసాల్ తమిళర్' అవార్డు



ప్రొఫెసర్ ఖాదర్ మొహిద్దీన్

చెన్నై, జూలై 4 (ఆంధ్రజ్యోతి): తమిళ ప్రజలకోసం నిస్వార్థంగా సేవలందించే ప్రముఖులకిచ్చే 'తగైసాల్ తమిళర్ అవార్డు'ను స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ యేడాది ఇండియన్ యూనియన్ ముస్లింలీగ్ జాతీయ అధ్యక్షుడు, ప్రొఫెసర్ కేఎం ఖాదర్ మొహిద్దీన్‌కు ప్రదానం చేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ప్రతియేటా తమిళ సేవాపరులకు తగైసాల్ తమిళర్ అవార్డులను ప్రదానం చేస్తోంది. ఆ మేరకు గత నాలుగేళ్లలో కమ్యూనిస్టు పార్టీ దిగ్గజాలు శంకరయ్య, ఆర్.నల్లకన్ను, ద్రావిడ కళగం నేత కె.వీరమణి, టీఎన్‌సీసీ మాజీ అధ్యక్షుడు కుమరి అనంతన్‌కు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ముఖ్యమంత్రి స్టాలిన్ ఈ అవార్డు ప్రదానం చేశారు. ఈ అవార్డుకోసం అర్హులైన వారిని ఎంపిక చేసే నిమిత్తం ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటైన కమిటీ సమావేశం శుక్రవారం ఉదయం సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో తీసుకున్న ఉమ్మడి నిర్ణయం ప్రకారం సీనియర్ రాజకీయవేత్త, 'మణిచుడర్' సంపాదకుడు, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ జాతీయ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఖాదర్ మొహిద్దీన్‌ను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. ముస్లింనేత దివంగత ఖాయిదే మిల్లత్ కాలం నుండి ఖాదర్ మొహిద్దీన్ సమాజసేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. తిరుచ్చి జమాల్ మహమ్మద్ కళాశాలలో 15యేళ్లపాటు హిస్టరీ ప్రొఫెసర్‌గా విశిష్ట సేవలందించారు. ఈ అవార్డు కింద రూ.10లక్షల నగదు, ప్రశంసాపత్రాన్ని అందించనున్నారు. ఆగస్టు 15న జరిగే స్వాతంత్ర్య వేడుకల్లో ముఖ్యమంత్రి స్టాలిన్ చేతుల మీదుగా ఈ అవార్డును ఖాదర్ మొహిద్దీన్ స్వీకరించనున్నారు.

ఒంటరి పోరే

- సీఎం అభ్యర్థిగా విజయ్ పోటీ
- ప్రతి ఇంటిలో ఒకరికి పార్టీ సభ్యత్వం
- టీవీకే కార్యనిర్వాహక మండలిలో నిర్ణయం
- ఆగస్టులో రెండో మహానాడుకు ఏర్పాట్లు



టీవీకే సమావేశంలో పాల్గొన్న పార్టీ అధినేత విజయ్, ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ తదితరులు

చెన్నై, జూలై 4 (ఆంధ్రజ్యోతి): వచ్చే యేడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, డీఎంకే పార్టీలతో పొత్తుపెట్టుకోకుండా ఒంటరిగానే బరిలోకి దిగాలని తమిళగ వెట్రి కళగం (టీవీకే) నిర్ణయించింది. నగర శివారు ప్రాంతం పనైయూరులో పార్టీ అధినేత విజయ్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన పార్టీ కార్యనిర్వాహక మండలి సమావేశం ఈ మేరకు తీర్మానించింది. ఆగస్టులో రెండో మహానాడు జరిపిన తర్వాత సెప్టెంబర్ నుంచి విజయ్ రాష్ట్రవ్యాప్త పర్యటన ప్రారంభించాలని కూడా నిర్ణయించారు. ఈ సమావేశంలో కార్యనిర్వాహక మండలి సభ్యులు, జిల్లా శాఖల కార్యదర్శులు, ప్రత్యేక ఆహ్వానితులు సహా 1200 మంది పాల్గొన్నారు. ఈ సమావేశంలోనే ఎన్నికల పొత్తులపై తుది నిర్ణయం తీసుకునే అధికారం పార్టీ అధ్యక్షుడు విజయ్‌కే అప్పగిస్తూ ఓ తీర్మానం కూడా చేశారు. ప్రతిఇంటా ఒకరికి పార్టీ సభ్యత్వం కల్పించాలని, వీధిలో కనీసం ఇద్దరు పార్టీ సభ్యులు తప్పనిసరిగా ఉండాలని, ఆ దిశగా పార్టీ సభ్యత్వ ముమ్మర కార్యక్రమాలను వేగవంతం చేయాలని పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో 20 తీర్మానాలను ప్రతిపాదించి ఏకగ్రీవంగా ఆమోదించారు.

జమిలి ఎన్నికలకు నిరసన...

టీవీకే కార్యనిర్వాహక మండలిలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పునర్విభజన పేరుతో లోక్‌సభ నియోజకవర్గాలను తగ్గించేందుకు చేస్తున్న ప్రయత్నాలను ఖండిస్తూ, ఒకే దేశం ఒకే ఎన్నికల నినాదంతో జరుపతలపెడుతున్న జమిలి ఎన్నికలకు నిరసన వ్యక్తం చేస్తూ వేర్వేరు తీర్మానాలు చేశారు. వచ్చే యేడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ తరఫున సీఎం అభ్యర్థిగా విజయ్ పోటీ చేయాలని, పొత్తులపై ఆయనే తుది నిర్ణయం తీసుకోవాలని తీర్మానాలు చేశారు. రెండో విమానాశ్రయం ఏర్పాటుతో భూములను కోల్పోనున్న పరందరూ సహా 13 గ్రామాల ప్రజల ఆందోళనకు అండగా నిలవాలని, పార్టీ సిద్ధాంతాలను విబేధించే పార్టీలతో పొత్తు పెట్టుకోకూడదని, రైతుల ఆందోళన పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వానికి నిరసన తెలుపుతూ, వరి, చెరకు రైతులకు పెండింగ్‌లో ఉంచిన బకాయిలను వెంటనే చెల్లించాలని, తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్న మామిడి రైతులను ఆదుకోవాలని కోరుతూ మరి కొన్ని తీర్మానాలు చేశారు. తిరుచ్చిలో ఇసుక చోరీలను అరికట్టాలని, ఎన్నెల్సీకి స్థలమిచ్చిన దాతలకు పూర్తిగా నష్టపరిహారం చెల్లించి, కుటుంబలో ఒకరి ఉద్యోగం ఇవ్వాలని, దిండుగల్ జిల్లాలో సుగంధ ద్రవ్యాల కర్మాగారాన్ని నెలకొల్పాలని, జాక్టో-జియో ఆందోళనకు మద్దతు ప్రకటిస్తూ, తమిళ జాలర్ల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలని కూడా తీర్మానాలను ప్రతిపాదించి ఆమోదించారు. రాష్ట్రంలో ద్విభాషా విద్యావిధానమే కొనసాగాలని కోరుతూ, పెరియార్, అన్నాదురై కీర్తి ప్రతిష్ఠలకు కళంకపరిచేలా వ్యవహరించిన బీజేపీ నేతల వైఖరిని ఖండిస్తూ, లాకప్ మరణాలను నిరోధించడంలో విఫలమైన రాష్ట్ర ప్రభుత్వాన్ని నిరసిస్తూ కూడా తీర్మానాలు చేశారు. కీళడి పురావస్తు తవ్వకాల నివేదికలను ఆమోదించకుండా తమిళుల నాగరికత కాలం వెలుగులోకి రానివ్వకుండా అడ్డుకుంటున్న కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ మరొక తీర్మానం చేశారు.

మీరు చర్యలు తీసుకుంటారా..

కేసు సీబీఐకి అప్పగించమంటారా?

● మాజీ మంత్రి పొన్ముడి వ్యవహారంలో పోలీసులను ప్రశ్నించిన హైకోర్టు



ప్యారీస్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): డీఎంకే సీనియర్ నేత, మాజీమంత్రి పొన్ముడి మహిళలను, శైవ, వైష్ణవ మతాలను కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన వ్యవహారంలో పోలీసులు మెతక వైఖరి ప్రదర్శించడం పట్ల మద్రాస్ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి తక్షణ చర్యలు తీసుకోకుంటే సీబీఐ విచారణకు ఆదేశించాల్సివస్తుందని ఉన్నత న్యాయస్థానం హెచ్చరించింది. పొన్ముడి మత విద్వేషాలను రెచ్చగొట్టేవిధంగా, పూజల్లో పాల్గొంటున్న మహిళలను కించపరుస్తూ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమైన విషయం తెలిసిందే. సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు పొన్ముడిపై కేసు నమోదు చేయకుండా పోలీసులు మెతక వైఖరి ప్రదర్శిస్తున్నారని భావించిన హైకోర్టు న్యాయమూర్తి ఆనంద్ వెంకటేష్ సుమోటోగా కేసు స్వీకరించారు. ఈ కేసుపై న్యాయమూర్తి వేల్‌మురుగన్ శుక్రవారం విచారణ జరిపారు. పొన్ముడికి వ్యతిరేకంగా మూడు పోలీస్‌స్టేషన్లలో నమోదైన ఫిర్యాదులపై జరిపిన విచారణలో ఆయన ఎవరినీ కించపరచలేదని తెలియడంతో ఫిర్యాదులను రద్దు చేసినట్లు రాష్ట్రప్రభుత్వం తరుపున హాజరైన అడ్వకేట్ జనరల్ పీఎస్ రామన్ తెలిపారు. ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా 112 ఫిర్యాదులు రాగా, వాటిపై చేపట్టిన దర్యాప్తు పెండింగులో ఉందని, 60 యేళ్ళ క్రితం జరిగిన కార్యక్రమం కోసమే పొన్ముడి వ్యాఖ్యానించారని ఆయన వివరించారు. ఇందుకు అభ్యంతరం తెలిపిన న్యాయమూర్తి పొన్ముడికి వ్యతిరేకంగా వచ్చిన ఫిర్యాదులపై పోలీసుశాఖ కేసు నమోదు చేసి, దర్యాప్తు జరిపేందుకు వెనుకాడితే న్యాయస్థానం ఊరుకోదని, సీబీఐకి విచారణ అప్పగించాల్సివస్తుందని హెచ్చరించారు. వేదికలపై మాట్లాడేందుకు ఎన్నో అంశాలుండగా, బాధ్యత గల మంత్రి పదవిలో ఉంటూ పొన్ముడి అలాంటి వ్యాఖ్యలు ఎందుకు చేయాల్సి వచ్చిందని ప్రశ్నించారు. మంత్రులుగా ఉన్నవారు సమాజశ్రేయస్సు గురించి తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా, పారదర్శకంగా తెలియజేయాలే కానీ 60యేళ్ళ క్రితం జరిగిన విషయాల గురించి ప్రస్తావించకూడదని సూచించిన న్యాయమూర్తి, ఈ కేసు తదుపరి విచారణను 8వ తేదీకి వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

పీఎంకే విప్ పదవి నుంచి అరుళ్ తొలగింపు

● స్పీకర్‌కు లేఖ అందజేసిన ఆ పార్టీ ఎమ్మెల్యేలు



సచివాలయం వెలుపల మీడియాతో మాట్లాడుతున్న పీఎంకే న్యాయవాది బాలు

చెన్నై, జూలై 4 (ఆంధ్రజ్యోతి): పాట్టాలి మక్కల్ కట్చి (పీఎంకే)లో పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్, పార్టీ అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి మధ్యసాగుతున్న ఆధిపత్య పోరు రోజురోజుకు మలుపులు తిరుగుతోంది. పార్టీలో అన్బుమణి చేసే నియామకాలను రాందాస్ రద్దు చేయడం, రాందాస్ నియమించే జిల్లా కార్యదర్శులను అన్బుమణి తొలగించడం ఆనవాయితీగా మారింది. దీంతో పార్టీ శ్రేణులు ఎవరి మాట వినాలో తెలియక సతమతమవుతున్నారు. ఈ నేపథ్యంలో రెండు రోజుల క్రితం సేలం వెస్ట్ శాసనసభ్యుడు అరుళ్‌ను అన్బుమణి పార్టీ సభ్యత్వం నుంచి తొలగించారు. అదే సమయంలో తనను పార్టీ నుండి తొలగించే అధికారం అన్బుమణికి లేదని అరుళ్ ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం శాసనసభలో చీఫ్ విప్‌గా ఉన్న అరుళ్‌ను ఆ పదవి నుంచి తొలగిస్తూ అన్బుమణి ప్రకటించారు. ఆ మేరకు అన్బుమణికి మద్దతునిస్తున్న పీఎంకే ఎమ్మెల్యేలు వెంకటేశ్వరన్, సదాశివం, మయిలం శివకుమార్, న్యాయవాది బాలు తదితరులు స్పీకర్ అప్పావును కలిసి అరుళ్‌ను పార్టీ విప్ పదవి నుండి తొలగించిన ఉత్తర్వులను సమర్పించారు. అదే సమయలో పార్టీ కొత్త విప్‌గా మయిలం శివకుమార్‌ను నియమిస్తూ పార్టీ అధ్యక్షుడు అన్బుమణి ఇచ్చిన లేఖ కూడా అందజేశారు. ఆ తర్వాత సచివాలయం వెలుపల పీఎంకే న్యాయవాది బాలు మీడియాతో మాట్లాడుతూ... డాక్టర్ అన్బుమణికే పార్టీపై అన్ని అధికారాలున్నాయని, పార్టీలో ఎవరిని తొలగించాలన్నా చేర్చుకోవాలన్నా తుది నిర్ణయం ఆయనదేనని స్పష్టం చేశారు. పార్టీ వ్యవస్థాపకుడిగా ఉన్న రాందాస్‌కు పార్టీపై పర్యవేక్షణ బాధ్యతలు మాత్రమే ఉంటాయన్నారు. పార్టీ సర్వసభ్యమండలి సమావేశాన్ని పార్టీ అధ్యక్షుడు మాత్రమే ఏర్పాటు చేయగలరని, మరెవరూ ఆ సమావేశాన్ని నిర్వహించడానికి ఆస్కారం లేదన్నారు. సేలం వెస్ట్ శాసనసభ్యుడు అరుళ్‌ను పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుండి అన్బుమణి తొలగించారని, ఈ కారణంగానే శాసనసభలో విప్‌గా మయిలం శివకుమార్‌ను ఎంపిక చేసుకున్నామని తెలిపారు.

డీఎంకే సైన్యంగా యువజన విభాగం

● ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి

చెన్నై, జూలై 4 (ఆంధ్రజ్యోతి): బాధ్యతాయుతమైన 12వేల మందితో కూడిన యువజన విభాగం డీఎంకే సైన్యంగా ఉందని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి పేర్కొన్నారు.. డీఎంకే యువజన విభాగం కార్యదర్శిగా ఆరు వసంతాలు పూర్తిచేస్తున్న ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ... యువజన విభాగం కార్యదర్శిగా ఏడో ఏట అడుగుపెట్టడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి జిల్లాలో బలమైన నిర్మాణంతో యువజన విభాగం, అట్టడుగుస్థాయి నుంచి ఆవిర్భంచిందని, తమిళ సమాజం పురోగతి కోసం యువజన విభాగం తరఫున మేము పని చేస్తున్నామని ఉదయనిధి తెలిపారు.

టీవీకే వ్యవహారంపై వేచి చూడండి

● నయినార్ నాగేంద్రన్ నర్మగర్భ వ్యాఖ్యలు



మీడియాతో మాట్లాడుతున్న బీజేపీ అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్

చెన్నై, జూలై 4 (ఆంధ్రజ్యోతి): వచ్చే యేడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లోగా ఎన్డీఏలో చేరిక గురించి టీవీకే నుంచి వచ్చే వార్త కోసం వేచిచూడాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం మొగప్పేర్ వెస్ట్‌లోని ఓ దుకాణాన్ని ప్రారంభించిన అనంతరం నాగేంద్రన్ మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని, హోంశాఖ నిర్వర్తిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్ ఆధీనంలో పోలీసుశాఖ లేదని, సచివాలయంలోని కొందరు ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారమే పోలీసులు నడచుకుంటున్నారని ఆరోపించారు. శివగంగ జిల్లా తిరుభువనం వద్ద ఆలయ వాచ్‌మన్‌ను చిత్రహింసలకు గురిచేసి ప్రత్యేక దళం పోలీసులు హతమార్చారన్నారు. లాకప్ డెత్‌కు కారకురాలైన నిఖిత సచివాలయంలోని ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడినట్టు చెబుతున్నారని, ఆమె ఆదేశాల మేరకు లాకప్‌డెత్ జరినట్లు నిర్ధారణ అవుతోందని ఆరోపించారు. 2011లో నిఖిత పెళ్ళిపేరుతో మోసాలకు పాల్పడినట్లు ఆమెపై పాత కేసులున్నాయని, రాష్ట్రంలో తీవ్ర ప్రకంపనలు సృష్టించిన లాకప్‌డెత్‌కు ముఖ్యమంత్రి స్టాలిన్ మృతుడి తల్లికి సారీ చెప్పి చేతులు దులుపుకున్నారని విమర్శించారు.. ఐదేళ్ల క్రితం సాత్తాన్‌కుళంలో తండ్రీకొడుకుల లాకప్ డెత్ ఘటనలో సీబీఐ విచారణ జరిపినా ఇంకా దోషులకు శిక్ష పడలేదని, అన్నా వర్శిటీలో విద్యార్థినిపై జరిగిన అత్యాచారం కేసులో ఐదు నెలల్లోనే దోషికి శిక్షపడిందని, అదే వేగంతో లాకప్‌డెత్ సంఘటనలపై విచారణ జరిపి దోషులను శిక్షించడానికి ముఖ్యమంత్రి ఎందుకు తటపటాయిస్తున్నారో తమకు అర్థం కావటంలేదన్నారు.పాట్టాలి మక్కల్ కట్చిలో ప్రస్తుతం కొనసాగుతున్న సంక్షోభానికి బీజేపీ ఎలాంటి సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు.. ఈ నెల 7న మేట్టుపాళయంలో అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ఎన్నికల ప్రచార యాత్ర ప్రారంభోత్సవంలో తాను పాల్గొంటానని చెప్పారు. ఎన్డీయేలో టీవీకే చేరుతుందా అని విలేఖరులు అడిగిన ప్రశ్నకు నయినార్ నాగేంద్రన్ బదులిస్తూ ఎన్నికలకు ఇంకా సమయం ఉందని, అంతా మంచే జరుగుతుందని, అంతవరకూ వేచిచూడాలని నర్మగర్భ వ్యాఖ్యలు చేశారు.

పుదుచ్చేరికి లగ్జరీ క్రూయిజ్ నౌక

అన్నాడీఎంకే నిరసన

పుదుచ్చేరి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కేంద్రపాలిత రాష్ట్రం పుదుచ్చేరికి లగ్జరీ నౌక రావడాన్ని ఖండిస్తూ అన్నాడీఎంకే భారీ ధర్నా నిర్వహించింది. పుదుచ్చేరిలో గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో లగ్జరీ నౌకాయాన పథకం అమలులోకి వచ్చింది. అప్పుడు ఈ పథకాన్ని ఎన్నార్ కాంగ్రెస్, అన్నాడీఎంకే తదితర పార్టీలు వ్యతిరేకించాయి. దీంతో ఈ పథకాన్ని ప్రభుత్వం రద్దు చేసింది. ఈ నేపథ్యంలో, 2022వ సంవత్సరంలో తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సముద్రమార్గంలో విశాఖపట్నం-చెన్నై-పుదుచ్చేరి మధ్య ఓ ప్రైవేటు సంస్థ ఆధ్వర్యంలో ప్రయాణీకుల నౌక ప్రారంభించగా, ఆ సమయంలో కూడా అభ్యంతరాలు వచ్చాయి. దీనికి కూడా పలు పార్టీలు అభ్యంతరం తెలపడంతో తాత్కాలికంగా రద్దు చేశారు. ఆ తర్వాత మళ్ళీ శుక్రవారం నుంచి ఈ పథకం అమలులోకి వస్తుందని ప్రకటించారు. ఆ మేరకు పుదుచ్చేరి సముద్రంలో క్రూయిజ్ నౌక 1,231 మంది ప్రయాణికులు, 574 మంది సిబ్బందితో విశాఖపట్నం నుండి బయలుదేరి పుదుచ్చేరి సముద్రతీరం నుంచి కిలోమీటరున్నర దూరంలో లంగర్ వేశారు. హార్బర్‌లో ఆ రాష్ట్ర పర్యాటకశాఖ ఆధ్వర్యంలో ప్రయాణికులకు ఆహ్వానం పలికారు. ఈ క్రమంలో లగ్జరీ నౌక వచ్చే సమయంలో హార్బర్ ప్రాంతాల్లో పడవలు నడపకుండా పుదుచ్చేరి కోస్ట్‌గార్డ్ స్టే విధించింది. దీంతో శుక్రవారం ఉదయం 9 నుండి 11 గంటల వరకు, సాయంత్రం 5 నుండి 6 గంటల వరకు కొత్త హార్బర్ ప్రాంతంలో పర్యాటకుల నౌకలు, స్క్యూబే ఫ్లయింగ్ నౌకలు, తెరచాప పడవల రాకపోకలను అనుమతించలేదు. దీనికి పుదుచ్చేరి రాష్ట్ర జాలర్ల తరుపున అభ్యంతరం తెలిపిన అన్నాడీఎంకే మత్స్యకారులతో కలిసి హార్బర్ ప్రాంగణంలో ధర్నా నిర్వహించారు. అన్నాడీఎంకే కార్యదర్శి అన్బలగన్ అధ్యక్షతన సుమారు 200 మందికి పైగా ఆందోళన పాల్గొన్నారు. క్రూయిజ్ నౌకాయాణం వల్ల స్థానిక జాలర్లు ఆర్థికంగా నష్టపోతున్నారని, ఈ నౌకను రాష్ట్రంలోకి రాకుండా నిలిపివేయాలని డిమాండ్ చేశారు.



నిరసన తెలుపుతున్న అన్నాడీఎంకే శ్రేణులు

సమాచార దర్శిని

'క్యూట్' ఫలితాల విడుదల

పెరంబూర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర విశ్వవిద్యాలయాలు, అనుబంధ కళాశాలల్లో అడ్మిషన్లకు 'క్యూట్' ప్రవేశ పరీక్ష మే 13 నుంచి జూన్ 4వ తేది వరకు నిర్వహించారు. ఆ పరీక్షా ఫలితాలు https://cuet.nta.nic.in అనే వెబ్‌సైట్‌లో శుక్రవారం విడుదల చేశారు. మరిన్ని వివరాలకు 011-40759000 అనే నెంబరు సంప్రదించవచ్చు.

ఏడాదిలో 17,702 పోస్టుల భర్తీ టీఎన్‌పీఎస్సీ

పెరంబూర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది నిర్వహించిన రాతపరీక్షల్లో, ప్రభుత్వ శాఖల్లోని వివిధ విభాగాలకు 17,702 మందిని ఎంపిక చేసినట్లు తమిళనాడు ప్రభుత్వ ఉద్యోగుల ఎంపిక కమిషన్ (టీఎన్‌పీఎస్సీ) ఒక ప్రకటనలో తెలిపింది. 2024 జూన్ నుంచి ఈ ఏడాది జూన్ వరకు ఈ పోస్టులు భర్తీచేశారు. ఆ ప్రకారం, 2026 జనవరి వరకు నిర్ణయించిన లక్ష్యాన్ని ఏడు నెలల ముందే పూర్తిచేశారు. అలాగే, మరో 2,500 పోస్టుల భర్తీ ప్రక్రియ జరుగుతుందని టీఎన్‌పీఎస్సీ తెలిపింది.

చెన్నై-సెంగోట్టై మధ్య ప్రత్యేక రైళ్లు

పెరంబూర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): తిరుచెందూర్ ఆలయ కుంభాభిషేకంలో పాల్గొనే భక్తుల సౌకర్యార్థం చెన్నై ఎగ్మూర్ నుంచి సెంగోట్టైకు ఈ నెల 6,7 తేదీల్లో ప్రత్యేక రైళ్లు నడుపనున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. ఎగ్మూర్ నుంచి ఈ నెల 6వ తేది రాత్రి 9.55 గంటలకు బయల్దేరే ప్రత్యేక రైలు మరుసటి రోజు ఉదయం 11.30 గంటలకు సెంగోట్టై చేరుకుంటుంది. మరుమార్గంలో సెంగోట్టై నుంచి 7వ తేది రాత్రి 7.45 గంటలకు బయల్దేరే ప్రత్యేక రైలు మరుసటిరోజు ఉదయం 9.05 గంటలకు ఎగ్మూర్ చేరుకుంటుంది. ఈ రైళ్లు చెంగల్పట్టు, విల్లుపురం, తిరుచ్చి, దిండుగల్, మదురై, తిరునల్వేలి మార్గంగా నడుపనున్నారు.

వేళచ్చేరి రైల్వేస్టేషన్‌లో 'ఇండోర్ స్పోర్ట్స్ హాల్'

పెరంబూర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక వేళచ్చేరి రైల్వేస్టేషన్ ప్రాంగణంలో 'ఇండోర్ స్పోర్ట్స్ హాల్' నిర్మాణానికి దక్షిణ రైల్వే టెండర్లు విడుదల చేసింది. ఆదాయం సమకూరేలా, ప్రజలకు ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించే చర్యల్లో ఒక ప్రయత్నంగా ఈ ప్రక్రియ చేపట్టినట్లు దక్షిణ రైల్వే తెలిపింది.

294 మంది టీచర్లకు హెచ్‌ఎంలుగా పదోన్నతి

పెరంబూర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 2025-26వ విద్యా సంవత్సరం ఉపాధ్యాయుల బదిలీ కౌన్సెలింగ్ బుధవారం జరిగింది. అందులో 153 మహోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, 42 ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తాము కోరుకున్న జిల్లాలకు బదిలీ అయ్యారు. అలాగే, గురువారం జరిగిన కౌన్సెలింగ్‌లో, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పీజీ టీచర్లు మొత్తం 294 మంది మహోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతులు పొందారని పాఠశాల విద్యాశాఖ తెలిపింది.

శిక్షణ కేంద్రాల ఏర్పాటుకు టెండర్లు

పెరంబూర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): 'నాన్ ముదల్వన్' పథకంలో శిక్షణా కేంద్రాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం టెండర్లు ఆహ్వానిస్తోంది. నాన్ ముదల్వన్ పథకంలో పోటీ పరీక్షల విభాగాన్ని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి 2023 మార్చి 7వ తేది ప్రారంభించారు. ఈ విభాగంలో రాష్ట్రానికి చెందిన యువతకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి నిర్వహించే పోటీ పరీక్షలకు శిక్షణ ఇవ్వనున్నారు. చెన్నై, మదురై, కోయంబత్తూర్‌లో శిక్షణా కేంద్రాల ఏర్పాటుకు టెండర్లు ఆహ్వానించారు. బ్యాంక్ పరీక్షలు, కేంద్ర ప్రభుత్వ పోటీ పరీక్షలకు ఈ కేంద్రాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రభుత్వం తెలిపింది.

కులశేఖరపట్టణం ప్రాజెక్ట్ కోసం టెండర్లు

పెరంబూర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కులశేఖరపట్టణంలో రాకెట్ల కోసం జనరల్ టెక్నికల్ సర్వీస్ సెంటర్ ఏర్పాటుకు ప్రాజెక్ట్ నివేదిక సిద్ధం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం టెండర్లు ఆహ్వానించింది. ఇస్రో 2వ ప్రయోగ వేదిక కులశేఖరపట్టణంలో ఏర్పాటు చేయనున్నారు. రాకెట్లు తయారుచేయడం, పరీక్షించడం ఈ కేంద్రంలో జరుగుతాయని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది.

టూవేగా రాయపేట పాటుల్లాస్ రోడ్డు

పెరంబూర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాయపేట పాటుల్లాస్ రోడ్డును టూవేగా మార్చారు. ఎగ్మూర్ నుంచి వెళ్లే వాహనాలు స్మిత్ రోడ్డు మీదుగా వెళ్లి, ఎడమవైపు తిరిగి వైట్స్ రోడ్డు మీదుగా రాయపేట చేరుకోవాల్సి ఉంది. ఇరుకైన రోడ్డుగా ఉన్న స్మిత్ రోడ్డులో వాహనాలు సకాలంలో వెళ్లలేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్య పరిష్కరించేలా పాటుల్లాస్ రోడ్డును గురువారం నుంచి టూ వేగా మార్చినట్లు ట్రాఫిక్ పోలీసు విభాగం ఒక ప్రకటనలో తెలిపింది.

రేషన్ కార్డులు చెల్లవనే వదంతులు నమ్మొద్దు

పెరంబూర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): బయోమెట్రిక్‌లో గత నెల 30వ తేదిలోగా వేలిముద్రలు నమోదుచేయని వారి రేషన్ కార్డులు చెల్లవంటూ వస్తున్న వదంతులు నమ్మొద్దని ప్రభుత్వం తెలిపింది. రేషన్ దుకాణాల్లో రేషన్ కార్డుదారుల వేలిముద్రలు బయోమెట్రిక్‌లో నమోదుచేసి సరుకులు ఇస్తుంటారు. కొన్ని జిల్లాల్లో రేషన్‌కార్డుదారుల వేలిముద్రలు బయోమెట్రిక్‌లో ఇంకా నమోదుచేయలేదు. ఈ క్రమంలో, గత నెల 30లోగా బయోమెట్రిక్ వేలిముద్రలు నమోదుచేయని వారి రేషన్ కార్డులు చెల్లవంటూ సామాజిక మాధ్యమాల్లో వార్తలు వెలువడ్డాయి. ఈ విషయమై రాష్ట్ర సమాచార శాఖ విడుదల చేసిన ప్రకటనలో... బయోమెట్రిక్‌లో నమోదుచేయని రేషన్ కార్డులు చెల్లవంటూ వస్తున్న వదంతులు నమ్మరాదని, అదే సమయంలో బయోమెట్రిక్‌లో వేలిముద్రలు నమోదుచేయని వినియోగదారులు రేషన్ దుకాణానికి వెళ్లి వేలి ముద్రలు నమోదుచేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించింది.

9న తిరుప్పోరూర్‌లో అన్నాడీఎంకే ధర్నా

ప్యారీస్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ప్రజల కనీస అవసరాలను పూర్తిచేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న డీఎంకే ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈ నెల 9వ తేదీ చెంగల్పట్టు జిల్లా తిరుప్పోరూర్‌లో అన్నాడీఎంకే ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు పార్టీ ప్రధాన కార్యదర్శి, ప్రతిపక్షనేత ఎడప్పాడి పళనిస్వామి ప్రకటించారు. అన్నాడీఎంకే ప్రధాన కార్యాలయం శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో రోడ్లు సాఫీగా లేనందువల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నా ప్రభుత్వం మాత్రం పట్టించుకోవట్లేదన్నారు. ప్రజలకు కనీస వసతులు కల్పించడంలో విఫలమైన డీఎంకే ప్రభుత్వానికి వ్యతిరేకంగా 9వ తేదీ ఉదయం 9 గంటలకు చెంగల్పట్టు జిల్లా తిరుప్పోరూర్ శాసనసభ నియోజకవర్గంలో ధర్నా నిర్వహించనున్నట్లు ఈపీఎస్ తెలిపారు.

తిరుత్తణిలో సామూహిక వివాహాలు

తిరుత్తణి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం సామూహిక వివాహాలు జరిగాయి. రాష్ట్ర హిందూ దేవాదాయశాఖ ఆధ్వర్యంలో నిరుపేద కుటుంబాలకు చెందిన యువతీ, యువకులకు తిరుత్తణి క్షేత్రంలో వివాహాలు నిర్వహిస్తున్నారు. ఆ రీతిలో శుక్రవారం ఉదయం పేదకుటుంబాలకు చెందిన వధూవరులకు ఎమ్మెల్యే ఎస్.చంద్రన్ మంగళసూత్రాలు అందించగా, వేదమంత్రాల నడుమ నూతన జంటలు ఒకటయ్యారు. అనంతరం ఎమ్మెల్యే చంద్రన్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే ప్రభుత్వం ప్రజలకు సంక్షేమ పథకాలతో పాటు వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతోందని, ఇందు భాగంగానే ఆర్థికంగా వెనుకబడిన నిరుపేద జంటలకు వివాహ పథకం రూపొందించారని తెలిపారు. తర్వాత ఆయన దంపతులకు దేవాదాయశాఖ తరుపున పట్టువస్త్రాలు, వెండి దీపాలు, రూ.30వేలు తదితర సహాయాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిషనర్ రమణి, డీఎంకే కార్పొరేటర్ వినోద్‌కుమార్ తదితరులు పాల్గొని నూతన జంటను ఆశీర్వదించారు.



వధూవరులకు మంగళసూత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే చంద్రన్ తదితరులు

8న నెల్లయప్పర్ ఆలయ రథోత్సవం

● ఆణి ఉత్సవాలు ప్రారంభం

ప్యారీస్, జూలై4(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం తిరునల్వేలిలో ప్రసిద్ధి చెందిన నెల్లయప్పర్ ఆలయ రథోత్సవం ఈనెల 8వతేదీ నిర్వహించేందుకు ఆలయ అధికారులు విస్తృతంగా ఏర్పాట్లు చేశారు. కాంతిమతి అమ్మవారి సమేత నెల్లయప్పర్ ఆలయంలో ప్రతిఏటా ఆణి ఉత్సవాలను 10రోజుల పాటు నిర్వహిస్తుంటారు..ఈఏడాది ఉత్సవాలు శుక్రవారం ఉదయం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రాంగణంలో ఉన్న ధ్వజస్తంభం వద్ద శివాచార్యులు కాంతిమతి సమేత నెల్లయప్పర్ ఉత్సవమూర్తులను కొలువుదీర్చి పతాకానికి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల శివనామస్మరణ, వేదమంత్రోచ్చారణ మధ్య ధ్వజ పతాకం ఆవిష్కరించి ఆణి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలో, తిరునల్వేలి టౌన్ పోలీసుశాఖ రథోత్సవం సందర్భంగా భక్తులకు కొన్ని సూచనలిచ్చింది. రథోత్సవంలో పాల్గొనదలిచిన వారు కులంపేరుతో డిజైన చేసిన టీషర్టులు ధరించరాదని, కుల సంఘాల జెండాలు వినియోగించరాదని, అదేవిధంగా కుల సంఘాల నేతల పేర్లతో నినాదాలుచేయకూడదని, చిన్నపిల్లలు, మహిళలు, సీనియర్ సిటీజన్లు, దివ్యాంగులకు ఆటంకం కలిగించరాదని పోలీస్‌శాఖ హెచ్చరించింది.

అత్యుత్తమ ఆహారం లభించే వంద నగరాల్లో 75వ స్థానంలో చెన్నై

పెరంబూర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో అత్యుత్తమ ఆహారం లభించే వంద నగరాల జాబితాలో చెన్నై 75వ స్థానంలో నిలిచింది. అలాగే, ఈ జాబితాలో దేశంలోని చెన్నై సహా ఆరు నగరాలున్నాయి. 'టేస్ట్ అట్లాస్' అనే సంస్థ ప్రపంచవ్యాప్తంగా ఉన్న సంప్రదాయ వంటలను సమీక్షించడంతో పాటు విమర్శనాత్మక సమీక్షలు, పరిశోధన కథనాలు ప్రచురిస్తోంది. తాజాగా ఆ సంస్థ ప్రపంచంలో రుచికరమైన, నాణ్యమైన ఆహారం అందించే వంద నగరాలతో కూడిన జాబితాను విడుదల చేసింది. ఈ జాబితాలో అమృత్‌సర్ 43వ స్థానం, ఢిల్లీ 45, హైదరాబాద్ 50, కొల్‌కొత్తా 71, చెన్నై 75వ స్థానంలో నిలిచాయి. వడ పావ్, పావ బజ్జీ, బొంబాయి బిర్యానీ, అమృత్‌సర్ గుల్చా, చోలే బతురే, బటర్ చికెన్, రసగుల్లా, దోశ, ఇడ్లీ తదితరాలు ఈ జాబితాలో కొన్ని ప్రసిద్ధ వంటకాలుగా ఉన్నాయి.

పైలెట్ రాకపోవడంతో విమానం జాప్యం

పెరంబూర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక మీనంబాక్కం స్వదేశీ విమానాశ్రయంలో గురువారం ఉదయం 11.30 గంటలకు ఇండిగో ఎయిర్ లైన్స్ విమానం 162 మంది ప్రయాణికులతో పాట్నా వెళ్లాల్సి ఉంది. కానీ, నిర్వహణ కారణాలతో విమానం ఆలస్యంగా బయల్దేరుతుందని ప్రకటించారు. దీంతో, అధికారులతో ప్రయాణికులు వాగ్వివాదానికి దిగారు. అనంతరం మధ్యాహ్నం ఒంటి గంటకు ప్రయాణికులను విమానంలోకి అనుమతించగా, 1.33 గంటలకు విమానం బయల్దేరి వెళ్లింది. కాగా, విమానం ఆలస్యానికి కారణంగా పైలెట్ సమయానికి రాకపోవడమే కారణమని తెలిసింది. కానీ, ఈ విషయాన్ని ఇండిగో ఎయిర్‌లైన్స్ సంస్థ నిర్ధారించలేదు.

7న రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో అదనపు టోకెన్లు

పెరంబూర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): శుభముహూర్తం రోజైన ఈ నెల 7వ తేది రాష్ట్రంలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అదనపు టోకెన్లు అందించనున్నట్లు రిజిస్ట్రేషన్ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. సాధారణ రోజుల కంటే శుభ ముహూర్తాల రోజుల్లో ఆస్తులు, భూముల క్రయ విక్రయాలు ఎక్కువగా జరుగుతుంటాయి. ఈనేపథ్యంలో ఈ నెల 7వ తేది రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో అదనపు టోకెన్లు అందించనున్నారు. ఆ ప్రకారం, ఒక సబ్ రిజిస్ట్రార్ ఉన్న కార్యాలయాల్లో వందకు బదులు 150, ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లు ఉన్న కార్యాలయాల్లో 300 టోకెన్లు అందించనున్నట్లు అధికారులు తెలిపారు.

వైద్య విద్యార్థులపై దాడి

పచ్చయప్పన్ కళాశాలకు చెందిన పది మందిపై కేసు

చెన్నై, జూలై 4 (ఆంధ్రజ్యోతి): నగరంలో వైద్య విద్యార్థులపై దాడి చేసిన వ్యవహారంలో పచ్చయప్పన్ కళాశాలకు చెందిన 10 మంది విద్యార్థులపై కేసు నమోదైంది. యునానీ వైద్యకళాశాలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు ఎంటీసీ బస్సులో ప్రయాణం చేస్తుండగా, పచ్చయప్పన్ కళాశాల విద్యార్థులు హేళన చేసినట్లు, అదేమని అడిగిన వైద్య విద్యార్థులపై పచ్చయప్పన్ కళాశాల విద్యార్థులు దాడిచేశారు. వైద్య విద్యార్థుల ఫిర్యాదు ఆధారంగా 10 మంది పచ్చయప్పన్ కళాశాల విద్యార్థులపై పోలీసులు కేసు నమోదుచేసి విచారిస్తున్నారు.

సివిల్ కేసుల్లో పోలీసుల జోక్యం ఎందుకు?

● ప్రశ్నించిన హైకోర్టు

పెరంబూర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): సివిల్ కేసుల్లో పోలీసులు ఎందుకు జోక్యం చేసుకుంటున్నారని హైకోర్టు ప్రశ్నించింది. హైకోర్టు మదురై బెంచ్ పరిధిలోని పలు జిల్లాల్లో సివిల్ కేసుల్లో పోలీసులు జోక్యం చేసుకుంటున్నారని, దానిపై నిషేధం విధించాలని కోరుతూ పలు పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ కేసులను హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి పుహళేంది విచారించారు. ఇదే అంశంపై గత విచారణ సమయంలో న్యాయమూర్తి పలు ప్రశ్నలు లేవనెత్తారు. ముఖ్యంగా, హైకోర్టు, సుప్రీంకోర్టు సివిల్ కేసుల్లో పోలీసులు జోక్యం చేసుకోకూడదని పలుమార్లు ఉత్తర్వులు జారీచేశాయన్నారు. అలాగే, రాష్ట్ర డీజీపీ కూడా సివిల్ కేసుల్లో పోలీసులు జోక్యం చేసుకోవద్దని సర్క్యులర్ జారీ చేశారన్నారు. అయినా పోలీసులు సివిల్ కేసుల్లో జోక్యం చేసుకుంటున్నారని, ఈ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరి ఏమిటి? దీనిపై హోం శాఖ కార్యదర్శి, డీజీపీ అఫిడవిట్ దాఖలుచేయాలని న్యాయమూర్తి ఉత్తర్వులు జారీచేశారు. ఈ నేపథ్యంలో, ఈ కేసు శుక్రవారం న్యాయమూర్తి పుహళేంది నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది. ఆ సమయంలో, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన క్రిమినల్ న్యాయవాది హసన్ మొహమ్మద్ జిన్నా హాజరై... సివిల్ కేసుల్లో పోలీసులు జోక్యం చేసుకోకూడదని ఇదివరకే డీజీపీ సర్క్యులర్ జారీచేశారని, అది మీరి కొందరు పోలీసులు జోక్యం చేసుకోవడం దురదృష్టకరమన్నారు. ఒకరిద్దరు మాత్రమే ఇలా చేస్తున్నారని, ఈ లోపాలు ఎలా పరిష్కరించాలని అన్నా దానిపై రాష్ట్ర పోలీసు చీఫ్‌తో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపారు. ఇలాంటి ఆరోపణలు విచారించి నివేదిక సమర్పించేలా, ఐజీ స్థాయి పోలీసు అధికారి, ప్రభుత్వ సీనియర్ అదనపు ప్రాసిక్యూటర్ తదితరులతో కమిటీ ఏర్పాటుచేసినట్లు వివరించారు. ప్రభుత్వ వివరణ పరిగణలోకి తీసుకున్న న్యాయమూర్తి, కేసు విచారణ వాయిదావేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

డీఎంకే కూటమిలోకి రండి

పీఎంకేకు టీఎన్‌సీసీ వినతి

చెన్నై, జూలై 4 (ఆంధ్రజ్యోతి): బీసీలు, ఎస్సీ ఎస్టీలకు మంచి జరగాలంటే పీఎంకే తప్పకుండా డీఎంకే నాయకత్వంలోని ఇండియా కూటమిలో చేరాలని టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై పిలుపునిచ్చారు. పీఎంకే వ్యవస్థాపకుడు రాందాస్‌ను తాను ఇటీవల కలిసినప్పుడు రాజకీయాలు గురించి మాట్లాడలేదని, అయితే ఎన్నికల పొత్తుపై చర్చలు జరిపినట్లు పుకార్లు వ్యాపింపచేశారని, కూటమిలో ఏ పార్టీని చేర్చుకోవాలనే విషయంపై నిర్ణయంతీసుకోవాల్సింది డీఎంకే అధిష్టానమేనని తెలిపారు. ప్రస్తుతం ప్రధాన ప్రతిపక్షమైన అన్నాడీఎంకే మతతత్త్వపార్టీ బీజేపీతో పొత్తుపెట్టుకోవడం సబబు కాదన్నారు. డీఎంకే కూటమికి తప్పకుండా పీఎంకే మద్దతివ్వాలని, ఆ దిశగానే రాందాస్ తగు చర్యలు చేపడతారని తాను ఆశిస్తున్నట్లు ఆయన చెప్పారు.

అన్నాడీఎంకే ఆధ్వర్యంలో కార్మికులకు సహాయాల పంపిణీ

ప్యారీస్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే నిర్వహణలోని అన్నా కార్మిక సంఘం ఆధ్వర్యంలో పేద కార్మికులకు శుక్రవారం ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ఆర్థిక సహాయం అందజేశారు. రాయపేటలోని పార్టీ ప్రధాన కార్యాలయం ఎంజీఆర్ మాళిగైలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి వచ్చిన ఆయనకు పార్టీ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. పార్టీ ప్రధాన కార్యాలయ ప్రాంగణంలోని దివంగత మాజీముఖ్యమంత్రులు ఎంజీఆర్, జయలలిత విగ్రహాలకు నివాళులర్పించారు. అనంతరం అన్నా కార్మిక సంఘంలోవున్న 171 మంది పేద కార్మికులు, వారి కుటుంబాలకు తలా రూ.లక్ష విలువైన చెక్కులను ఈపీఎస్ అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ కోశాధికారి దిండుగల్ శ్రీనివాసన్, ఉప ప్రధాన కార్యదర్శులు కేపీ మునుస్వామి, నత్తం విశ్వనాథన్, కార్యాలయ కార్యదర్శి ఎస్పీ వేల్‌మణి, కార్మికుల సంఘ కార్యదర్శి కమల కన్నన్, ప్రిసీడియం కార్యదర్శులు సి.పొన్నయ్యన్, పి.వలర్మతి, గోకుల ఇందిరా, బెంజిమెన్‌లతో పాటు పార్టీ అనుబంధశాఖల నిర్వాహకులు పాల్గొన్నారు.



ఎంజీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఈపీఎస్

వీసీల నియామకంపై కౌంటర్ వేయండి

● యూజీసీ, గవర్నర్‌లకు సుప్రీంకోర్టు ఆదేశం

అడయార్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలకు వైస్ చాన్సలర్లను రాష్ట్ర ప్రభుత్వం నియమించేలా వీలు కల్పించిన నిబంధనల అమలుపై స్టే విధించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ జరిపింది. ఈ అంశంలో కౌంటర్ దాఖలు చేయాలని యూజీసీ, గవర్నర్‌లను ఆదేశిస్తూ తదుపరి విచారణను నాలుగు వారాల పాటు వాయిదా వేసింది. రాష్ట్రంలోని వర్శిటీలకు వీసీలను నియమించే అధికారాన్ని గవర్నర్ నుంచి తొలగించి, రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించడంతో పాటు మొత్తం పది ముసాయిదా బిల్లులను రాష్ట్ర శాసనసభ ఆమోదించి, వాటిని గవర్నర్‌కు పంపించింది. అయితే, గవర్నర్ ఈ బిల్లులు ఆమోదించకుండా సుదీర్ఘకాలం పాటు పెండింగ్‌లో ఉంచారు. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ వేయగా, దీనిపై విచారణ జరిపి శాసనసభ ఆమోదించిన పది ముసాయిదా బిల్లులకు పచ్చజెండా ఊపింది. సుప్రీంకోర్టు తీర్పుతో రాష్ట్రంలోని పలు వర్శిటీలకు ప్రభుత్వం వీసీలను నియమించింది. ఇదిలావుంటే, తిరునెల్వేలికి చెందిన వెంకటాచలపతి అనే న్యాయవాది మద్రాస్ హైకోర్టులో పిటిషన్ వేశారు. రాష్ట్రంలోని వర్శిటీలకు వీసీల నియాకానికి సంబంధించి ప్రభుత్వానికి అధికారం కల్పించే నిబంధనలను రద్దు చేయాలని తన పిటిషన్‌లో కోరారు. దీన్ని విచారణకు స్వీకరించిన హైకోర్టు ఆ నిబంధనల పై తాత్కాలిక స్టే విధించింది. ఈ నేపథ్యంలో హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న ఈ కేసును సుప్రీంకోర్టుకు బదిలీ చేయాలని కోరుతూ రాష్ట్ర ప్రభు త్వం పిటిషన్ వేయగా, విచారణకు స్వీకరించిం ది. ఈ పిటిషన్‌లో శుక్రవారం మరోమారు విచారణ జరిగింది. విచారణ సందర్భగా ఇరు వర్గాల వాదనలు ఆలకించిన అపెక్స్ కోర్టు న్యాయమూర్తులు పీఎస్ నరసింహా, ఆర్.మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం... వీసీల నియమించే అంశం పై యూజీసీ, గవర్నర్ కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది.

ఆంధ్రాలో కోవై యువకుడి ఆత్మహత్య

తుళ్లూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : అమరావతి రాజధాని ప్రాంతంలో ఉన్న మంతెన సత్యనారాయణ ఆశ్రమంలో గురువారం రాత్రి ఓ యువకుడి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలిల. కోయంబత్తూరుకు చెందిన భూపతి (23) ఆరు నెలల క్రితం ఇంటర్న్‌షిప్ కోసం ఆశ్రమానికి వచ్చాడు. ఇతనితోపాటు మరో 40 మంది కూడా వచ్చారు. ఆశ్రమంలో ఉంటున్న భూపతి ఫ్యాన్‌కి ఉరేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. ప్రేమించిన యువతికి తాను ఉరేసుకుంటున్నట్టు ఫోన్ చేసి భూపతి చెప్పాడు. మృతుడితో పాటు వచ్చిన వారికి ఈ విషయాన్ని ఆ యువతి సమాచారం ఇచ్చింది. దీంతో వారు గదికి వెళ్ళి చూడగా అప్పటికే ఉరేసుకున్నట్టు తుళ్లూరు ఎస్ఐ కలగయ్య తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృత దేహాన్ని మంగళగిరి ఎయిమ్స్‌కు తరలించారు. పోస్టుమార్టం అనంతరం బంధువులకు భూపతి మృతదేహాన్ని శుక్రవారం అప్పగించినట్టు ఎస్ఐ తెలిపారు.

ఈరోడ్ కలెక్టరేట్‌కు బాంబు బెదిరింపు

చెన్నై, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ జిల్లా కలెక్టర్ కార్యాలయానికి బాంబు బెదిరింపు రావటంతో పోలీసులు బాంబ్‌స్క్వాడ్‌తో వెళ్ళి క్షుణ్ణంగా తనిఖీ చేశారు. గురువారం సాయంత్రం ఆ కార్యాలయానికి వచ్చిన ఓ లేఖలో గుర్తు తెలియని వ్యక్తులు కలెక్టర్ కార్యాలయంలో బాంబులుంచేందుకు కుట్ర పన్నారని, తన ప్రాణానికి భద్రత కల్పిస్తే బాంబులు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నవారి వివరాలను వెల్లడిస్తానని ఉంది. ఆ లేఖ చివరన ఓ న్యాయవాది పేరున్నట్లు గమనించారు. ఈ లేఖను కలెక్టర్ సహాయకుడు చూసి వెంటనే ఈ విషయాన్ని పోలీసులకు తెలిపారు.. పోలీసులు బాంబు స్క్వాడ్‌తో వెళ్ళి కలెక్టర్ కార్యాలయం అంతటా తనిఖీ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని ఆ బాంబు బెదిరింపు లేఖ రాసిన వ్యక్తి ఆచూకీ కోసం గాలిస్తున్నారు.



కలెక్టర్ కార్యాలయంలో జాగిలంతో తనిఖీ చేస్తున్న పోలీసులు

తేనె తాగి విద్యార్థులకు అస్వస్థత

పెరంబూర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) తేనె సేవించి 13 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటన విల్లుపురం జిల్లాలో చోటుచేసుకుంది. కోనేరికుప్ప సరస్వతి కళాశాల భవనం పైభాగంలో తేనె పట్టు ఉంది. వేసవి సెలవుల తరువాత కళాశాల ప్రారంభమైంది. ఈ తేనె పట్టు నుంచి తేనీటీగలు వచ్చి విద్యార్థులపై దాడిచేసే ప్రమాదముందని భావించిన కళాశాల యాజమాన్యం, అగ్నిమాపక సిబ్బంది ద్వారా తేనె పట్టు తొలగించారు. ఈ సమయంలో అగ్నిమాపక శాఖ సిబ్బంది, లాండర్స్ అనే రసాయన స్ప్రే ద్వారా తేనె పట్టును తొలగించినట్లు తెలిసింది. శుక్రవారం యథావిధిగా కళాశాలకు వచ్చిన విద్యార్థులు తేనె పట్టు నుంచి తొలగించిన కొంత భాగం పడి ఉండడడంతో అందులోని తేనె తాగారు. కొద్దిసేపటికి 13 మంది విద్యార్థులు వాంతులు చేసుకుంటూ స్పృహతప్పి పడిపోయారు. ఉపాధ్యాయులు వారిని వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. రసాయన స్ప్రే చేసిన తేనె పట్టు భాగంలోని తేనె సేవించడంతో విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని వైద్యులు తెలిపారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

పసికందు మృతదేహాన్ని ఎత్తుకెళ్లిన శునకం

పెరంబూర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): పసికందు మృతదేహాన్ని నోట కరుచుకుని శునకం వీధుల్లో తిరగడంతో ప్రజలు దిగ్భ్రాంతి చెందారు. అరియలూరు జిల్లా ఆర్ఎస్ మాతూర్ గ్రామంలోని ఓ కల్యాణ మండపం వెనుక చెత్త తొట్టెలో పుట్టి కొద్ది నిముషాలే అయిన ఆడశిశువు మృతదేహం పడి ఉంది. అంతలో ఓ శునకం తొట్టెలోని పసికందు మృతదేహాన్ని నోట కరుచుకుని పరుగులు తీసింది. అది చూసిన స్థానికులు, శునకాన్ని బెదిరించడంతో, మృతదేహాన్ని వదిలి శునకం వెళ్లిపోయింది. స్థానికుల సమాచారంతో కువాగం పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ పసికందు ఎవరిది? మృతశిశువా? వివాహేతర సంబంధంతో జన్మించిందా? ఒకవేళ పసికందును హతమార్చి తొట్టెలో వేశారా? అంటూ పలు కోణాల్లో పోలీసులు విచారణ చేపట్టారు.



మహిళ స్నానం చేస్తుండగా వెళ్లి కటకటాలపాలైన కానిస్టేబుల్

పెరంబూర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మహిళ స్నానం చేస్తుండగా చొరబడిన కానిస్టేబుల్ కటకటాలపాలయ్యాడు. తెన్‌కాశి జిల్లా అళగునాచియర్‌పురం గ్రామానికి చెందిన మనోకుమార్(29) తెన్‌కాశి సాయుధ దళం కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. ఘటన జరిగిన రోజున అతను ఓ ఇంట్లోకి వెళ్లాడు. ఆ సమయంలో ఓ మహిళ స్నానం చేస్తోంది. ఇంట్లో ఎవరూ లేరని గ్రహించిన మనోకుమార్, బాత్రూమ్‌లోకి వెళ్లి ఆమెను లైంగిక వేధింపులకు గురిచేసినట్లు సమాచారం. మహిళ కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకునేలోగా మనోకుమార్ పరారయ్యాడు. ఈవ్యవహారంపై బాధిత మహిళ కుటుంబ సభ్యులు కురివికుళం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు మనోకుమార్‌ను అరెస్ట్ చేసి విచారిస్తున్నారు.

ప్లస్ టూ విద్యార్థి హత్య

● సహ విద్యార్థుల అరెస్టు

అడయార్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ జిల్లా కుమలన్ కుట్టై సెల్వం నగర్‌కు చెందిన ఆదిత్య (17) అనే విద్యార్థి హత్య కేసులో ఇద్దరు సహచర విద్యార్థులను పోలీసులు అరెస్టు చేశారు. గురువారం పాఠశాలకు వెళ్ళిన ఆదిత్య.. సాయంత్రానికి పాఠశాల సమీపంలో శవమై కనిపించాడు. ఈ విషయం తెలిసిన తల్లిదండ్రులు బోరున విలపిస్తూ, తమ కుమారుడి మృతి పట్ల అనుమానం ఉందంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టిన పోలీసులు... ఇద్దరు సహ విద్యార్థులను శుక్రవారం అరెస్టు చేశారు. బాలికలతో ఆదిత్య మాట్లాడటాన్ని జీర్ణించుకోలేని ఆ ఇద్దరు విద్యార్థులు భౌతికదాడి చేశారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన ఆదిత్య ప్రాణాలు కోల్పోయినట్టు విచారణలో తేలింది. దీంతో ఆ ఇద్దరు విద్యార్థులను పోలీసులు అరెస్టు చేశారు. కేసు విచారణ జరుపుతున్నారు.

ప్రేమించలేదని విద్యార్థినులపై కత్తితో దాడి

చెన్నై, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ప్రేమించడం లేదని ఇద్దరు విద్యార్థినులపై కత్తితో దాడిచేసిన యువకుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. కడలూరు జిల్లా గోపాలపురం గ్రామానికి చెందిన అరుళ్‌కుమార్ ప్లస్ టూ చదువుతున్న విద్యార్థినిని ఏడాది కాలంగా ప్రేమిస్తున్నాడు. కానీ, అతని ప్రేమను ఆమె అంగీకరించలేదని సమాచారం. ఈ నేపథ్యంలో, శుక్రవారం ఉదయం విరుదాచలం కడ వీధిలో ఉన్న బస్టాండ్‌లో బస్సు కోసం వేచి ఉన్న విద్యార్థిని ముఖంపై అరుళ్‌కుమార్ కత్తితో దాడిచేశాడు. అతడిని అడ్డుకోబోయిన మరో విద్యార్థినిపై కూడా అతను కత్తితో దాడి చేసి పరారయ్యాడు. గాయపడిన వారిని చుట్టుపక్కల వారు ఆస్పత్రికి తరలించారు. బస్టాండ్‌లోని సీసీ కెమెరాల్లో అరుళ్‌కుమార్ విద్యార్థినులపై దాడి చేసిన దృశ్యాలు నమోదయ్యాయి. కేసు నమోదుచేసిన పోలీసులు పరారైన అరుళ్‌కుమార్ కోసం గాలిస్తున్నారు.

చెన్నై చేరుకున్న తమిళ జాలర్లు

అడయార్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): శ్రీలంక నుంచి ఐదుగురు తమిళ జాలర్లు శుక్రవారం నగరానికి చేరుకున్నారు. రామనాథపురం జిల్లా రామేశ్వరం ప్రాంతానికి చెందిన కొంతమంది జాలర్లు ఫిబ్రవరి 5వ తేదీ సముద్రంలోకి చేపల వేటకు వెళ్ళారు. వీరిలో కొందరు జాలర్లు అంతర్జాతీయ సరిహద్దులను దాటారనే ఆరోపణలతో శ్రీలంక నావికా దళం అరెస్టు చేసింది. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి మేరకు భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికారులు ఈ జాలర్ల విడుదలకు చొరవ తీసుకున్నారు. దీంతో ఈ జాలర్లను లంక కోర్టు విడిపించడంతో కొలంబో నుంచి చెన్నైకు విమానంలో చేరుకున్నారు. వీరికి మత్స్య శాఖ అధికారులు స్వాగతం పలికి, ఆ తర్వాత వారి సొంతూర్లకు పంపించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ప్యారీస్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

పోరూర్: సెంబరంబాక్కం వరదరాజపురం, పణిమలర్ మెడికల్ కాలేజ్, బెంగళూరు ట్రంక్ రోడ్డు, కొళప్పన్‌జేరి, చొక్కనల్లూర్, పిడారితాంగళ్ కొంత భాగం, కామాక్షి నగర్, నెల్లితోపు మహాలక్ష్మి నగర్, తిరుపతి నగర్, మారుతి నగర్, జనని నగర్, గురు అవెన్యూ, శ్రీనివాస నగర్, మాసిలామణి నగర్, మేల్మా నగర్, మల్లిక నగర్, ఛార్లెస్ నగర్, శబరి నగర్, కొళువాణివాక్కం, రాజీవ్ నగర్, అమ్మన్ నగర్, లక్ష్మి నగర్, కుండ్రత్తూర్ మెయిన్ రోడ్డు, కేకే నగర్, అన్నా వీధి, గోవిందరాజ్ నగర్, అలెక్స్ నగర్, ఎస్ఎస్కే అవెన్యూ, ముత్తుకుమరన్ కాలేజ్.

తాంబరం: ఓట్టేరి, ఊరపాక్కం, వండలూరు, సింగార తోట్టం హిల్ వ్యూ, గంగైఅమ్మన్ ఆలయం, వెంకటేశపురం, లక్ష్మిపురం, ఇరణియమ్మన్ ఆలయ వీధి, ఆర్ఎంకే గుండుమేడు, ముత్తువేలర్ వీధి, కృష్ణా రోడ్డు, వివేక్ నగర్, కామధేను నగర్, కార్తికేయన్ నగర్, భారతి నగర్, బాలాజి నగర్, గణేష్ నగర్, తిరువళ్లువర్ వీధి, భారతీదాసన్ వీధి, అవ్వై వీధి, శ్రీ రామ్ పార్క్ 63 అపార్ట్‌మెంట్, వోక్ వీధి, ఎస్వీ నగర్, కలైవాణి వీధి, మణి వీధి, అమ్మన్ ఆలయ వీధి, మణిమేఘలై వీధి, తోల్‌కాప్పియర్ 1,2 వీధులు, టీకేసీ వీధి, కామరాజర్ నగర్, గాంధీ వీధి, కట్టబొమ్మన్ వీధి, అన్నా వీధి, రాజీవ్ గాంధీ వీధి, కన్నన్ అవెన్యూ 1 నుంచి 5 వీధులు, మాడంబాక్కం మెయిన్ రోడ్డు, గోకుల్ నగర్, పొన్నియమ్మన్ ఆలయ వీధి, భజన ఆలయ వీధి, వెంకటాచలపతి వీధి, మూర్తి కాలని, కలక్కా నగర్, రాజరాజేశ్వరి నగర్, కృష్ణా నగర్, పీటీసీ కాలని, భజన ఆలయ 2వ వీధి, అరుళ్‌నేరి నగర్.

పల్లావరం: ముసాత్తి వీధి, హసన్ బాషా వీధి, యాసిన్ ఖాన్ వీధి, క్రైలర్ వీధి ముత్తుసామివీధి, చెల్లమ్మాల్ వీధి, మీనాక్షి నగర్ 1 నుంచి 10 వీధులు, ఆంజేయ ఆలయ వీధి, కలాధరన్ వీధి, సెయలగం-కాలని, కట్టబొమ్మన్ వీధి, మారియమ్మన్ ఆలయ వీధి, కస్తూరిభాయ్ వీధి, కలైవానర్ నగర్, శుభం నగర్, యాదవన్ వీధి, అమ్మన్ నగర్, మూవరసంపేట మెయిన్ రోడ్డు, రాజీవ్ గాంధీ వీధి, ఆంజేయర్ నగర్, పచ్చయమ్మన్ ఆలయ వీధి.

తిరునీర్‌మలై: తేరడి వీధి, తూర్పు, దక్షిణ మాఢ వీధులు. కుళక్కరై వీధి, వీజీఎన్, మహాలక్ష్మి నగర్, తిరునీర్‌మలై మెయిన్ రోడ్డు, వేంబులి అమ్మన్ ఆలయ వీధి, భజన ఆలయ వీధి, మల్లికా వీధి, శివరాజ్ వీధి, ఒలియాళిఅమ్మన్ ఆలయ వీధి, టీచర్స్ వీధి, జగజ్జీవన్ రామ్ వీధి, రెట్టమలై శ్రీనివాసన్ వీధి, తంగవేల్ వీధి.

ఐటీ కారిడార్: ఎంసీఎన్ నగర్, ఎక్స్‌టెన్షన్, బౌండరీ రోడ్డు, పిళ్లయార్ ఆలయ వీధి, ఎస్బీఐ కాలని, గంగైయమ్మన్ ఆలయ వీధి, ఆనంద్ నగర్, కామరాజ్ వీధి, ఇండస్ట్రియల్ ఎస్టేట్ రోడ్డు, బాలవినాయగర్ అవెన్యూ, ప్రకాశం వీధి, రామన్ నగర్, శ్రీపురం రోడ్డు, ఎల్లయమ్మన్ నగర్.

తిరుముడివాక్కం: ఎంకేబీ నగర్, ఉమెన్స్ ఇండస్ట్రియల్ పార్క్, తిరునీర్‌మలై మెయిన్ రోడ్డు, పెరుమాళ్ నగర్, శ్రీకృష్ణా నగర్, వళుతలంబేడు, మైక్రో ఎస్టేట్, పామ్ రివేరా అపార్ట్‌మెంట్, రాయల్ కాజిల్ ఐ,జె,ఓ,పి, క్యూఆర్ బ్లాక్ అమర్‌ప్రకాష్ అపార్ట్‌మెంట్ కుండ్రత్తూర్, కుమరన్ నగర్, మహాలక్ష్మి సహకార సంఘం, పీకేవీ మహా నగర్, కలైమగళ్ నగర్, కర్పగం నగర్, దాసియోవా ఇండస్ట్రియల్ పార్క్.

కోయంబేడు మార్కెట్: రెడ్డి వీధి, దయాచరణ్ రోడ్డు, ఏరికరై వీధి, పల్లవన్ నగర్, మందవెలి వీధి, శివనిధి అవెన్యూ, శక్తి నగర్, సి బ్లాక్ కావ్య గార్డన్, కృష్ణా నగర్, అగత్తియ నగర్, అంబికా నగర్, వీజీపీ, అముద నగర్, టీహెచ్ రోడ్డు, రాజీవ్ గాంధీ వీధి.

సూర్య విజయ్‌ను అభినందించిన విజయ్

స్టంట్ మాస్టర్ అనల్ అరసు దర్శకుడిగా మారి ప్రముఖ నటుడు విజయ్ సేతుపతి తనయుడు సూర్య విజయ్ హీరోగా తెరకెక్కించిన 'ఫీనిక్స్'. శుక్రవారం విడుదలైంది. ఈ చిత్రం విడదలకు ముందే ప్రముఖ అగ్ర నటుడు విజయ్ ఈ సినిమా చూసి, హీరో సూర్య విజయ్‌ను అభినందించారు. విజయ్ సేతుపతి నటించిన 'నానుమ్ రౌడీదాన్', 'సింధుబాద్' వంటి చిత్రాల్లో సూర్య విజయ్ చిన్న చిన్న పాత్రల్లో కనిపించారు. ఇపుడు 'ఫీనిక్స్' చిత్రంలో హీరోగా నటించారు. స్టంట్ మాస్టర్ అనల్ అరసు దర్శకత్వంతో పాటు ఈ చిత్రాన్ని సొంతంగా నిర్మించారు. గత యేడాది నవంబరులోనే విడుదలకావాల్సి ఉండగా, అనివార్య కారణాల కారణంగా వాయిదా వేసి, శుక్రవారం విడుదల చేశారు. ఈ నేపథ్యంలో చిత్రాన్ని వీక్షించిన విజయ్... యువ హీరోతో పాటు దర్శకుడు, చిత్ర బృందాన్ని అభినందించినట్టు మేకర్స్ వెల్లడించారు. ఈ సందర్భంగా విజయ్‌తో కలిసి దర్శకుడు, హీరో దిగిన ఫొటోను సోషల్ మీడియాలో రిలీజ్ చేశారు. అలాగే, ఈ సినిమా ప్రీమియర్ షో చూసిన అనేక మంది సినీ ప్రముఖులు సూర్య విజయ్ నటనను మెచ్చుకున్నారు.


సూర్య విజయ్, విజయ్, అనల్ అరసు



'లవ్ మ్యారేజ్' సక్సెస్ మీట్

చిత్ర విజయంలో హీరోయిన్లే కీలకం : విక్రమ్ ప్రభు

'లవ్ మ్యారేజ్'లోని ఇద్దరు హీరోయిన్లు రెండు పిల్లర్లుగా ఉండి చిత్ర విజయంలో కీలక పాత్ర పోషించారని హీరో విక్రమ్ ప్రభు కొనియాడారు. అష్యూర్ ఫిలిమ్స్, ఈస్ట్ ఎంటర్‌టైన్మెంట్ సంస్థలు సంయుక్తంగా షణ్ముగ ప్రియన్ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'లవ్ మ్యారేజ్'. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన ఈ చిత్రం ఇటీవల విడుదలై ఘన విజయం సాధించింది.ఈ నేపథ్యంలో చిత్ర బృందం నగరంలో గురువారం థ్యాంక్స్ గివింగ్ మీట్ నిర్వహించింది. హీరో విక్రమ్ ప్రభు, నటుడు మురుగానందం, గేయరచయిత మోహన్ రాజన్, దర్శకుడు షణ్ముగ ప్రియన్, సంగీత దర్శకుడు షాన్ రోల్డన్, హీరోయిన్లు మీనాక్షి దినేష్, సుష్మిత భట్, నిర్మాత యువరాజ్ గణేశన్, సినిమా డిస్ట్రిబ్యూటర్ శక్తివేలన్ తదితరులు పాల్గొన్నారు. హీరో మాట్లాడుతూ, 'సాధారణంగా ఒక చిత్రం విడుదలైన తర్వాత అంతటితో నా పని అయిపోయిందని భావిస్తాను.కానీ, ఈ సినిమా విడుదలైన తర్వాత కూడా సినిమా ప్రమోషన్ కోసం పనిచేశాను. థియేటర్ విజిట్ కోసం మదురై, కోవై, తిరుచ్చి తదితర ప్రాంతాలకు వెళ్ళాను. ఆయా ప్రాంతాల్లో ప్రేక్షకుల స్పందన అద్భుతంగా ఉంది. ఈ సినిమా విజయంలో ఇద్దరు హీరోయిన్లదే కీలక పాత్ర. అలాగే, మీడియా మిత్రులు కూడా సినిమాకు పాజిటివ్ రివ్యూలు ఇచ్చి ప్రేక్షకులకు చేరేలా చేశారు.వారికి కూడా ప్రత్యేక ధన్యవాదాలు.ఈ సినిమా విజయం నాకు ఎంతో ప్రత్యేకం. మూవీలో దర్శకుడు కొత్తగా చూపించడం ఆనందంగా ఉంది' అన్నారు. దర్శకుడు షణ్ముగ ప్రియన్ మాట్లాడుతూ,'ప్రివ్యూ షో చూసిన తర్వాత మీడియా మిత్రుల అభినందనలు తొలి బిడ్డ పుట్టినపుడు కలిగే సంతోషం కంటే ఎక్కువగా పొందాను.నా తొలి చిత్రాన్ని కుటుంబ చిత్రంగా ఉండాలని నిర్ణయించుకునే ఈ కథ ఎంచుకున్నాను.స్క్రిప్టులో ఎలాంటి మార్పులు చేయకుండా అంగీకరించిన హీరో విక్రమ్ ప్రభుకు,మూవీకి విజయవంతమైన ఆల్బమ్‌ను అందించిన సంగీత దర్శకుడు షాన్ రోల్డన్‌కు ధన్యవాదాలు' తెలిపారు.'ఈ సినిమా విజయంలో మీడియా మిత్రులదే కీలక పాత్ర'అని పంపిణీదారుడు శక్తివేలన్ అన్నారు.

10న శశికుమార్ 'ఫ్రీడమ్' విడుదల

'టూరిస్ట్ ఫ్యామిలీ'తో బ్లాక్ బస్టర్ హిట్ తన ఖాతాలో వేసుకున్న హీరో శశికుమార్ ఇపుడు 'ఫ్రీడమ్' చిత్రంతో ప్రేక్షకుల ముందుకురానున్నారు. సత్యశివ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో లిజో మోల్ జోస్, సంతోష్ నాయర్, మాళవిక, బోస్ వెంకట్, రమేష్ ఖన్నా తదితరులు నటించారు. ఈ సినిమా ట్రైలర్ తాజాగా రిలీజ్ చేశారు. శ్రీలంక నుంచి శరణార్థులుగా భారత్‌లోకి వచ్చే వారి ఈలం తమిళుల జీవనపోరాటాన్ని ప్రధాన ఇతివృత్తంగా చేసుకుని తెరకెక్కించారు. శశికుమార్ నటించిన 'టూరిస్ట్ ఫ్యామిలీ' సినిమా ఈలం తమిళుల నేపథ్యంలోనే వచ్చినప్పటికీ అది హాస్యభరితంగా సాగి, ఘన విజయం సాధించింది. కానీ, 'ఫ్రీడమ్' కథ మాత్రం ఆద్యంతం సీరియస్ బాణీలో సాగుతున్నట్టు ట్రైలర్ చూస్తే తెలుస్తోంది. ముఖ్యంగా భారత్‌లోకి అడుగుపెట్టే ఈలం తమిళుల బాధ, జీవన పోరాటం, వారి స్థితిగతులను వాస్తవానికి దగ్గరగా చూపించినట్టు తెలుస్తోంది. ఈ ట్రైలర్‌కు మంచి స్పందన వచ్చింది.



హీరోయిన్లతో ధనుష్ పార్టీ



కోలీవుడ్ అగ్రనటుల్లో ఒకరైన ధనుష్ తాజాగా పలువురు హీరోయిన్లతో కలిసి పార్టీ చేసుకున్నారు. ఈ పార్టీ ఫొటోలను కనికా ధిల్లాన్ తన ఇన్‌స్టా ఖాతాలో షేర్ చేశారు. కోలీవుడ్ హీరో ధనుష్ నటుడిగా, దర్శకుడిగా, సింగర్‌గా, నిర్మాతగా రాణిస్తున్నారు. అదేసమయంలో వరుస చిత్రాల్లో నటిస్తూ బ్లాక్‌బస్టర్ హిట్‌లను తన ఖాతాలో వేసుకుంటున్నారు. తాజాగా 'కుబేర' మూవీతో కలెక్షన్లపరంగా మరోమారు రూ.100 కోట్ల క్లబ్‌లో చేశారు. మరోవైపు బాలీవుడ్ దర్శకుడు ఆనంద్ ఎల్.రాయ్ దర్శకత్వంలో 'తేరే ఇష్క్ మైన్' అనే చిత్రంలో నటిస్తుండగా, ఇటీవలే షూటింగ్ పూర్తి చేసుకుంది. దీనిని పురస్కరించుకుని చిత్ర దర్శకుడు పలువురు బాలీవుడ్ హీరోయిన్లతో కలిసి పార్టీ చేసుకున్నారు. ఈ పార్టీలో ధనుష్, చిత్ర హీరోయిన్ కీర్తి సనన్, మృణాల్ ఠాకూర్, తమన్నా భాటియా, భూమి ఫడ్నేకర్‌తో సహా బాలీవుడ్, సౌత్ ఇండియా హీరోయిన్లు పాల్గొన్నారు. ఈ ఫొటోలను ప్రముఖ రచయిత కనికా ధిల్లాన్ తన ఇన్‌స్టా ఖాతాలో షేర్ చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది.


అల్లూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న క్షత్రియ సేవా సమితి సభ్యులు

చెన్నై క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా అల్లూరి జయంతి వేడుకలు

ప్యారీస్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మన్యం వీరుడు, విప్లవజ్యోతి 'అల్లూరి సీతారామరాజు' 128వ జయంతి సందర్భంగా శుక్రవారం పెరంబూరు లోకో వర్క్స్ రైల్వేస్టేషన్ సమీపంలోని జగన్నాథన్ శాలై రోడ్డు వద్ద 'చెన్నై క్షత్రియ సేవా సమితి' సభ్యులు సీతారామరాజు చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షులు నామదేవరాజు మాట్లాడుతూ, భారతదేశ స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో తెల్లదొరలకు సింహస్వప్నంగా నిలిచిన పోరాట యోధుల్లో అల్లూరి సీతారామరాజు ఒకరన్నారు. సాయుధ పోరాటం ద్వారానే స్వాతంత్ర్యం సిద్ధిస్తుందని నమ్మి, స్వరాజ్యం కోసం తన ప్రాణాలను అర్పించిన మహనీయుడని కొనియాడారు. ఆ మహానుభావుని జీవితాన్ని నేటితరం స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.. అనంతరం క్షత్రియ సంఘ సభ్యులందరూ అల్లూరి సీతారామరాజు, తమిళనాడు దివంగత మాజీముఖ్యమంత్రి పీఎస్.కుమారస్వామిరాజా చిత్రపటాలకు పూలు చల్లి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షులు జానకీరామరాజు, రోశిరాజు, రవిరాజు, పవన్‌కుమార్‌రాజు, లక్ష్మీపతిరాజు, రామదాస్‌రాజు, గోపీరాజు, గోపీకృష్ణంరాజు, మోహన్‌రాజు, భాస్కర్‌రాజు, రవీంద్రవర్మన్, రాజశేఖర్‌రాజు, పెరుమాళ్‌రాజ్, సింగరాజ్‌వర్మన్, కాళహస్తి తేజావర్మ తదితరులు పాల్గొన్నారు.

మేట్టూరుకు చేరుతున్న నీరు



ప్యారీస్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): గత కొన్నిరోజులుగా కురుస్తున్న భారీవర్షాలకు కాలువలు పొంగి ప్రవహించడంతో మేట్టూరు డ్యాంకు వరదనీరు చేరుతోంది. మూడు రోజుల తర్వాత గురువారం డ్యాం నీటిమట్టం 120 అడుగులకు తగ్గింది. ఈ నేపథ్యంలో, కర్ణాటక రాష్ట్రంలో ఈశాన్య రుతుపవనాలు తీవ్ర రూపం దాల్చిన కారణంగా అక్కడున్న కబిని, కృష్ణరాజసాగర్ డ్యాంల నుంచి మిగుల జలాలను కావేరి నదిలోకి వదులుతున్నారు. ఈ నీరు కర్ణాటక-తమిళనాడు సరిహద్దు ప్రాంతంలోవున్న బిలుగుండు దాటి హొగెనెకల్ మీదుగా మేట్టూరు డ్యాంలో కలుస్తోంది. మరోవైపు డెల్టా జిల్లాల్లో కొన్నిరోజులుగా ఎగువున ఎడతెరపిలేకుండా వర్షాలు కురుస్తుండటంతో వరదనీరు డ్యాంలో చేరుతోంది. ఇన్‌ఫ్లో క్రమక్రమంగా పెరుగుతుండటంతో డ్యాం జలకళ సంతరించుకుంది. ఈ నేపథ్యంలో, కావేరి పరీవాహక ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రజా పనులశాఖ హెచ్చరించింది. మేట్టూరు ఆనకట్టకు వరదనీరు పెరుగుతుండటంతో భద్రతను దృష్టిలో ఉంచుకుని డ్యాం గేట్లను ఎత్తివేసి ప్రధాన కాలువల్లో వరదనీటిని విడుదల చేస్తున్నారు.

తిరుచెందూరు ఆలయ కుంభాభిషేకం

- ఏర్పాట్లను పరిశీలించిన ఎంపీ కనిమొళి



చెన్నై, జూలై 4 (ఆంధ్రజ్యోతి): తిరుచెందూరు సుబ్రహ్మణ్యస్వామివారి ఆలయ మహాకుంభాభిషేకం ఏర్పాట్లను డీఎంకే ఎంపీ కనిమొళి అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ నెల 7న మహాకుంభాభిషేకం జరుగనుండటంతో గురువారం రాత్రి ఆమె ఆలయానికి వెళ్ళి ఏర్పాట్లను పరిశీలించారు. ఆలయంలోని యాగశాలలు, గిరి ప్రాకారం, సముద్రతీరం తదితర ప్రాంతాలను దేవాదాయ శాఖ అదనపు కమిషనర్ పళని, జిల్లా కలెక్టర్ ఇలంభగవత్, ఆలయట్రస్టీ అరుళ్‌ముగన్‌తో కలిసి ఆమె పరిశీలించారు. ముందుగా తిరుచెందూరు దక్షిణ రథవీదిలో జరుగుతున్న మురుగు నీటి భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులను తనిఖీ చేశారు.



మగవారితో ధీటుగా మగువలు పోటీ పడుతున్న కాలమిది. అన్ని రంగాల్లోనూ మహిళలు ముందుకు దూసుకెళుతున్నారు. ఆ కోవలోనే కోయంబత్తూరు జిల్లా పొల్లాచ్చికి చెందిన కనిమొళి రాష్ట్రంలోనే మొదటి ఆమ్నీ బస్ మహిళా డ్రైవర్‌గా పేరు తెచ్చుకుంది. ఉపాధ్యాయవృత్తిలో ప్రవేశించాల్సిన సమయంలో ఊహించని విధంగా స్టీరింగ్ పట్టుకుంది. అదే ఆమె జీవితాన్ని మలుపుతిప్పింది. భర్త సహకారంతో ఆమె నడుపుతున్న ఆమ్నీ బస్సు రాకెట్‌లా దూసుకుపోతోంది. ఈ దంపతులు 'అళగన్ బస్' పేరుతో కంపెనీ నడుపుతున్నారు. పొల్లాచ్చి - చెన్నై రూట్‌లో అదీ రాత్రిపూట బస్సును వేగంగా, చాకచక్యంగా నడుపుతూ ప్రయాణికుల ప్రశంసలందుకుంటోంది. వాహన చోదకురాలు కనిమొళి జీవన ప్రయాణ సమాహారమే నేటి తరుణి ప్రత్యేకం!

\- టి.నగర్, ఆంధ్రజ్యోతి

టీచర్ కావాలనుకుని స్టీరింగ్ పట్టుకున్నా!


డ్రైవింగ్ సీట్‌లో కనిమొళి

- తొలి ఆమ్నీ బస్ మహిళా డ్రైవర్ కనిమొళి

?: ఆమ్నీ బస్సును నడపాలనే ఆలోచన ఎలా వచ్చింది.

! నేనూ, నా భర్త ట్రావెల్స్ కంపెనీ నడపాలని అనుకున్నప్పుడు, బిజినెస్‌లో లోటుపాట్లపై అవగాహన ఉండాలని భావించాం. ట్రావెల్స్ సంస్థకు డ్రైవర్ల ద్వారానే మంచి పేరు వస్తుందని తెలుసుకున్నాం. ఏ కారణం చేతనైనా డ్రైవర్ డ్యూటీకి రాకపోతే బస్సు ప్రయాణం ఆగిపోకూడదనుకున్నాం. అదే ఆలోచనతో డ్రైవింగ్ నేర్చుకోవాలని నిర్ణయించుకున్నాను. కారు డ్రైవింగ్ నాకెంతో ఇష్టం. అదీ రాత్రిపూట మైళ్లతరబడి సాఫీగా కారు నడిపేదాన్ని. ఈ విషయాన్ని గమనించే నా భర్త డ్రైవింగ్‌లో హెవీ లైసెన్స్ కోసం అప్లికేషన్ పెడుతున్నప్పుడు నన్ను కూడా భారీ వాహనాల డ్రైవింగ్ నేర్చుకోమని సలహా ఇచ్చారు. ఆ తర్వాత భారీ వాహనాల డ్రైవింగ్ శిక్షణ కూడా పొందాను. ప్రస్తుతం మా సొంత బస్సులోనే డ్రైవర్‌గా పనిచేస్తున్నాను.

? ఆమ్నీ బస్సు నడిపేందుకు ఇబ్బంది పడ్డారా

! సాధారణంగా కారు నడపటానికి, బస్సు నడపటానికి చాలా వ్యత్యాసాలున్నాయి. బస్సు పొడవు, వెడల్పుపై అవగాహన చాలా అవసరం. రహదారిలోని స్పీడ్ బ్రేకర్లను, ఎత్తుపల్లాలను గమనించి బస్సు నడపాలి. తొలిసారిగా కరూరు నుండి ఒట్టన్ సత్రం వరకు 50 కి.మీ. దూరం బస్సు నడిపి, చాలా థ్రిల్లింగ్ ఫీలయ్యాను.

? సాధారణంగా బస్ డ్రైవర్‌గా మారేందుకు మహిళలు ఇష్టపడరు. మీరెలా ఇంత వేగంగా బస్సును నడుపగలుగుతున్నారు.

! సాధారణంగా ఎవరైనా ఓ విషయం అసాధ్యమని చెబితే దానిని సాధ్యం చేసి చూద్దాం అనే ఆలోచన నాలో కలుగుతుంది. ఈ విషయంలో భర్త పూర్తిగా సహకరించినా మొదట కొద్దిగా భయమేసింది. ఆ తర్వాత క్రమంగా నాలో ధైర్యం చోటచేసుకుంది. ఆమ్నీ బస్సులో డ్రైవర్ సీటులో కూర్చునేటప్పుడు కలిగే ఫీలింగ్ మాటల్లో వర్ణించలేను.

? వృత్తిలో బిజీగా ఉండి కుటుంబ సభ్యులు, పిల్లలకు దూరమవుతున్నామనే ఫీలింగ్ రాలేదా

! ఆ బాధ తప్పకుండా ఉంటుంది. నా కుమారుడికి ఏడేళ్లు. కుమార్తెకు మూడేళ్లు. కుమార్తె బామ్మ సంరక్షణలో పెరుగుతుండటం వల దిగులుపడను. అయితే కుమారుడు మొదటి నుంచి నా పెంపకంలోనే పెరిగాడు అందుకే అతడి గురించే బాధపడుతుంటాను. దూరంగా డ్యూటీ చేస్తున్నప్పుడు ఫోన్ చేసి 'అమ్మా మిమ్మల్ని చూడాలని ఉంది. వెంటనే వచ్చేయ్' అని ఏడుస్తున్నప్పుడు చాలా బాధపడుతుంటాను. సగం దూరంలో ఉన్నాను. డ్యూటీ అయిన వెంటనే నీ దగ్గరకే వస్తాను అని బాబును బుజ్జగిస్తాను.

? మహిళలకు మీరిచ్చే సలహా

! ఆడపిల్లగా పుడితే చాలు. ఎన్నో ఆంక్షలు, కట్టుబాట్లు విధిస్తుంటారు. వాటన్నింటిని అధిగమించి సొంతకాళ్లపై నిలబడి సంపాదించాలి. ఎంచుకున్న మార్గం సక్రమంగా ఉంటే ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదు. 21 యేళ్ల వయస్సులో థర్డ్ ఇయర్ డిగ్రీ చదువుతున్నప్పుడు పెళ్ళయ్యింది. బీఇడి చదువుతున్నప్పుడు గర్భందాల్చాను. ఉదయం సీమంతం జరుపుకుని, పరీక్షలకు హాజరయ్యాను. అబ్బాయిపుట్టగానే ఎంఏలో చేరాను. అబ్బాయిని ఇంటిలో ఒంటరిగా వదలిపెట్టే పరీక్షలు రాశాను. ఏంఏ పాసయ్యాక అమ్మాయి పుట్టింది. ఇలా వ్యక్తిగత జీవితం సాగుతుండగానే మరో వైపు ఆమ్నీ బస్‌డ్రైవర్‌గా జీవనయానం కొనసాగింది. ఇటు కుటుంబాన్ని, అటు వృత్తిని బ్యాలెన్స్ చేసుకుంటూ వచ్చాను.

? విశ్రాంతి సమయాల్లో ఏం చేస్తుంటారు

! రెస్టు లేని జీవితం నాది. నాలుగు రోజులు సెలవుపెట్టి ఫ్యామిలీతో కలిసి టూర్ వెళదామనుకుంటే డ్రైవర్లు డ్యూటీకి వచ్చారా? బస్సును శుభ్రంగా క్లీన్ చేశారా? ప్రయాణికులతో ఏవైనా గొడవలు పడుతున్నారా? అనే ఆలోచనలే వస్తాయి. ప్రయాణికులను సంతృప్తిని కలిగించడమే మా ధ్యేయం కనుక వృత్తి, వ్యాపారంపైనే దృష్టిసారిస్తున్నాం. రోజుకు రెండు గంటలపాటు నిద్రపోయిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఏది ఏమైనా సరే జీవితంలో కొన్నింటిని త్యాగం చేసినప్పుడే సాధించగలం. ఆ త్యాగాలు అర్థవంతంగా ఉండాలి. అందరూ ఆనందించే విధంగా ఉండాలి. అప్పుడే జీవితం సార్థకమవుతుందని కనిమొళి తన అభిప్రాయాలను వెల్లడించింది.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకునేలా తోడ్పాటు


విద్యార్థులతో అతిథులు, నిర్వాహకులు

చెన్నై, జూలై 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత శిఖరాలు చేరుకునేలా తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని 'పుదియ తలైమురై' ఎస్‌జేఓ వీవీ వెంకటగిరి హామీ ఇచ్చారు. టి.నగర్‌లోని కేసరి మహోన్నత పాఠశాలలో 2023,2024 సంవత్సరంలో టెన్త్, ప్లస్ టూ పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థాయిలో నిలిచిన విద్యార్థులకు బంగారు, కాంస్య పతకాల ప్రదానోత్సవం శుక్రవారం జరిగింది. 1982వ సంవత్సరంలో చదివిన పూర్వ విద్యార్థి తుములూరి కృష్ణప్రసాద్ తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఆరేళ్లుగా టెన్త్, ప్లస్ టూ పబ్లిక్ పరీక్షల్లో పాఠశాల స్థాయిలో మొదటి మూడు స్థానాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తూ బహుమతులు అందజేస్తున్నారు. శుక్రవారం జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వీవీ వెంకటగిరి, విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. విద్యార్థుల ప్రార్థనా గీతంతో ప్రారంభమైన ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగుల గోపాలయ్య అధ్యక్షత వహించగా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ట్రిప్లికేన్ పార్థసారథి ఆలయ ప్రాంగణంలోని నరసింహస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీదేవి, భూదేవి సమేతుడై మాడవీధుల్లో ఊరేగుతున్న స్వామివారు


రాజ్‌భవన్‌లో ప్రముఖ జానపద వాద్యకళాకారుడు పద్మశ్రీ వేలు ఆసాన్‌కు సొంతింటి నిర్మాణానికి ఆర్థిక సాయం అందిస్తున్న గవర్నర్ ఆర్ఎన్ రవి

పొంగల్ నుంచి మదురై ఎయిమ్స్


మదురై ఎయిమ్స్ ప్రవేశ ద్వారం

పెరంబూర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మదురై ఎయిమ్స్ వైద్యకళాశాల వచ్చే ఏడాది పొంగల్ పండుగ నుంచి మదురై తోపూర్ ప్రాంగణంలో పనిచేస్తుందని ఆ సంస్థ నిర్వహణాధికారి హనుమంతరావు తెలిపారు. మదురై ఎయిమ్స్ వైద్యకళాశాలలో చేరిన విద్యార్థులకు తాత్కాలికంగా రామనాథపురం వైద్య కళాశాల ప్రాంగణంలో తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో, మదురై తోపూరులో శుక్రవారం మీడియా సమావేశంలో ఎయిమ్స్ నిర్వహణాధికారి హనుమంతరావు మాట్లాడుతూ... 2026 జనవరి పొంగల్ పండుగ నుంచి, మదురై తోపూర్ ఎయిమ్స్ ప్రాంగణంలోనే వైద్యకళాశాల పనిచేస్తుందని తెలిపారు. ఎయిమ్స్ వైద్యకళాశాల నిర్మాణ పనులు చివరి దశలో ఉన్నాయన్నారు. ఈ ఆరు నెలల కాలంలో తరగతి గదులు, 120 పడకలతో ఆస్పత్రి ప్రాంగణం, అవసరమైన ఉపకరణాలు ఏర్పాటుచేయనున్నామని తెలిపారు. అలాగే, 2027లో మదురై ఎయిమ్స్ ఆస్పత్రి పనులు పూర్తి చేసి ప్రారంభించాలని నిర్ణయించామన్నారు. ప్రస్తుత నిర్మాణపనులు ప్రతి నెలా సమీక్షిస్తున్నట్లు, నిర్మాణాలపై ప్రతి నెల నివేదిక అందించాలని కాంట్రాక్ట్ సంస్థను ఆదేశించినట్లు హనుమంతరావు తెలిపారు.

హిందూ కళాశాలలో ప్లాస్టిక్ రహిత దినోత్సవం

అడయార్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక పట్టాభిరాంలోని హిందూ కాలేజీలో సెంటర్ ఫర్ క్లైమేట్ లిటరసీ అండ్ క్యాంపెయిన్ (సీసీఎల్‌సీ) ఆధ్వర్యంలో గురువారం అంతర్జాతీయ ప్లాస్టిక్ రహిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలేజీ యాజమాన్యం మార్గదర్శకత్వంలో కళాశాల విద్యార్థులు, సిబ్బంది, అధ్యాపకులు తమ దైనందిని జీవితాల్లో ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడానికి, వారిళ్లను ప్లాస్టిక్ రహితంగా మార్చడానికి కృషి చేస్తామని ఈ సందర్భంగా వారు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కళాశాల సంచాలకులు డాక్టర్ ఎన్.రాజేంద్రనాయుడు, సీసీఎల్‌సీ కన్వీనర్ డాక్టర్ ఆర్.రఘురామ్ కాగితంతో తయారు చేసిన పేపర్ బ్యాగులను ఆవడి పూల మార్కెట్ వ్యాపారులకు పంపిణీ చేశారు. కాలేజీ ప్రాంగణాన్ని ప్లాస్టిక్ రహితంగా మార్చడం, ప్లాస్టిక్ వ్యర్థాల నుంచి సముద్ర జలాలు, జలచరాలను రక్షించడం వంటి ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రచార బోర్డులను ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.


పేపర్ బ్యాగులు పంపిణీ చేస్తున్న దృశ్యం


భక్తులపైకి నిమ్మకాయలు విసురుతున్న అర్జున వేషధారి

కలెక్టర్‌కు పలువురి శుభాకాంక్షలు

తిరుపతి(కలెక్టరేట్), జూలై 4(ఆంధ్రజ్యోతి): కలెక్టర్‌గా వెంకటేశ్వర్ బాధ్యతలు స్వీకరించి శుక్రవారం నాటికి సంవత్సరం పూర్తి కావడంతో కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. డీఆర్వో నరసింహులు, డీపీవో సుశీలాదేవి, ఎస్‌డీసీలు దేవేంద్రరెడ్డి, సుధారాణితో పాటు వివిధ శాఖల అధికారులు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. జిల్లా అభివృద్ధిలో అందరి సహకారం ఉందని, సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువయ్యేలా చూడాలని కలెక్టర్ వారికి సూచించారు.


కలెక్టర్ వెంకటేశ్వర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న జిల్లా అధికారులు



సర్వే సత్యనారాయణ- చమక్ చంద్ర

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, జూలై4 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ, సినీ హాస్య నటుడు చమక్ చంద్ర, తెలంగాణ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కలెక్టర్ వెంకటేశ్వర్ ఉన్నారు.


సర్వదర్శనానికి 13 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 13 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయారు. క్యూలైన్ కృష్ణతేజ సర్కిల్ వరకు వ్యాపించారు. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.3.54 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 64,015

తలనీలాలు సమర్పించినవారు: 26,786





అర్జున తపస్సు

శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధమైన ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అర్జున తపస్సు జరిగింది. ఆలయం ఎదుట ఏర్పాటు చేసిన తపస్మాన్‌ను మెట్టుమెట్టుకు పద్యాలు పాడుతూ అర్జున పాత్రధారి అధిరోహించారు. ఈ ఉత్సవానికి భక్తజనం పోటెత్తారు. అర్జున పాత్రధారి మంత్రించి తపాస్మన్ నుంచి వెదజల్లే నిమ్మకాయల కోసం భక్తులు పోటీ పడ్డారు. ఈ నిమ్మకాయల వల్ల శుభం కలుగుతుందని భక్తుల నమ్మకం. కాగా, దీని కోసం ఏడు బస్తాల నిమ్మకాయలను సిద్ధం చేయగా అర్జున వేషధారి తాటిచెట్టుపైకి చేరుకునేటప్పటికి నాలుగు బస్తాలే పైకి పంపారు. మిగిలిన మూడింటిని కొందరు ఉద్యోగులు మాయం చేశారన్న ఆరోపణలు వచ్చాయి. దీనిపై భక్తుల్లో నిరాశ వ్యక్తమైంది.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

అనుమానంతో తల్లీకొడుకుల దాడి

అవమానంతో మహిళ ఆత్మహత్య

● మృతదేహంతో బంధువుల ధర్నా

పెళ్లకూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): తన భర్తకు వివాహేతర సంబంధం ఉందన్న అనుమానంతో కుమారుడితో కలిసి ఆమె.. ఆ మహిళపై దాడి చేసింది. ఆ అవమానం భరించలేక బాధితురాలి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు, బంధువులు తెలిపిన ప్రకారం.. పెళ్లకూరు మండలం పునబాక గిరిజన కాలనీలో అమాస సాయి, దుర్గ (22) దంపతులు ఉంటున్నారు. వీరికి రెండేళ్ల కుమారుడు ఉన్నాడు. కిడ్నీ వ్యాధితో చికిత్స పొందుతూ సాయి ఇంట్లోనే ఉండగా, దుర్గ కూలి పనులు చేస్తోంది. ఈ క్రమంలో బుధవారం సాయిని కుటుంబసభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో దుర్గపై అదే గ్రామానికి చెందిన నీలం వెంకటసుబ్బయ్యగౌడ్ భార్య మస్తానమ్మ, ఆమె కుమారుడు అబ్దుల్ దాడికి పాల్పడ్డారు. దీనిని అవమానంగా భావించిన ఆమె పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. బంధువులు తిరుపతికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది. దుర్గ మృతదేహానికి శుక్రవారం అంత్యక్రియలు జరిగే సమయంలో ఈ దాడి విషయం తెలిసింది. వెంటనే బంధువులు ఆగ్రహంతో పెళ్లకూరుకు చేరుకుని పోలీస్‌స్టేషన్ సమీపంలో జాతీయ రహదారిపై మృతదేహం ఉంచి ధర్నా చేపట్టారు. దుర్గపై దాడి చేసిన వారిని తక్షణం అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. నాయుడుపేట సీఐ సంఘమేశ్వరరావు, పెళ్లకూరు, నాయుడుపేట, ఓజిలి, దొరవారిసత్రం ఎస్ఐలు నాగరాజు, ఆదిలక్ష్మి, అజయ్‌కుమర్, స్వప్న, సిబ్బందితో అక్కడికి చేరుకుని ఆందోళనకారులకు నచ్చజెప్పి ధర్నా విరమింప జేశారు. అదే మృతదేహంతో పోలీస్‌స్టేషన్ ఎదుట బాధితులు మళ్లీ ధర్నా చేశారు. తమకు మద్దతుగా వచ్చిన దళితనేత యాగాన్ని బెన్నీపై దాడికి పాల్పడిన వెంకటసుబ్బయ్య గౌడ్ బంధువులను పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చే వరకు ధర్నా విరమింప చేసేదిలేదన్నారు. నిందితులను అరెస్టుచేసి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో మృతదేహాన్ని తీసుకుని తమ కాలనీకి వెళ్లారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.


పోలీస్ స్టేషన్‌లోకి చొరబడుతున్న వారిని అదుపు చేస్తున్న పోలీసులు

తిరుపతిలో కిలేడి

● ఆస్తికోసం భర్త, బిడ్డను వదిలేసి రెండో పెళ్లికి సిద్ధం

● తనపై దాడి చేస్తోందంటూ పెళ్లికుమారుడి తల్లి ఫిర్యాదు

తిరుపతి(నేరవిభాగం), జూలై 4 (ఆంధ్రజ్యోతి): 'భర్త, బిడ్డను కాదనుకుంది. డబ్బు కోసం రెండో పెళ్లికి సిద్ధమైంది. ఈ పెళ్లికి ఒప్పుకోని తనను వేధింపులకు గురిచేసి.. హత్యకు యత్నిస్తోందని పెళ్లికుమారుడి తల్లి, ఎస్వీబి కాలనీకి చెందిన నాగరత్న భాగవతారిణి ఆవేదన వ్యక్తంచేశారు. దీనిపై శుక్రవారం ఎస్పీకి ఫిర్యాదు చేసిన ఆమె మీడియాతోనూ మాట్లాడారు. 'తిరుపతి నగరం భవానీనగర్‌లో బ్యూటీపార్లర్ నడుపుతున్న మహిళకు భర్త, కుమార్తె ఉన్నారు. నా కుమారుడు ఆర్.గోపినాథ్‌కు మాయమాటలు చెప్పి పెళ్లికి ఒప్పించింది. నేను సంపాదించిన ఇళ్లు, ప్లాట్లు, ఇతర ఆస్తులను దౌర్జన్యంగా తీసుకోవడానికి ఆమె నా కొడుకును పెళ్లి చేసుకుంటోంది. నేను ఒప్పుకోకపోవడంతో నా కుమారుడిని రెచ్చగొట్టి నానా ఇబ్బందులకు గురి చేస్తోంది. నా కుమారుడితో కలిసి నన్ను హతమార్చడానికి పథకం వేసింది. ఇందులో భాగంగా ఇద్దరూ కలిసి పెళ్లి పత్రికలు కొట్టించి నా ఇంటికొచ్చారు. గురువారం రాత్రి కూడా నాపై దాడికి దిగారు. దీంతో శుక్రవారం ఎస్పీ హర్షవర్ధనరాజును కలిసి వారిద్దరిపై ఫిర్యాదు చేశా'నని ఆమె పేర్కొన్నారు. దీనిపై పోలీసులు విచారించి, వారిద్దరి నుంచి తనకు ప్రాణ రక్షణ కల్పించాలని కోరారు.


మీడియాతో మాట్లాడుతున్న నాగరత్న

గంజాయి మత్తులో వేధింపులు

● బాలిక బలవన్మరణం.. ముగ్గురిపై కేసు

తిరుచానూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): అభం శుభం తెలియని బాలికను ప్రేమపేరుతో గంజాయి మత్తులో ఓ యువకుడు వేధించాడు. అతడి కుటుంబీకులూ సహకరించారు. దీంతో ఆ బాలిక బలవన్మరణం చెందిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. తిరుచానూరు ఎస్ఐ సాయినాథ్‌చౌదరి తెలిపిన ప్రకారం.. తిరుపతి రూరల్ మండలం పద్మావతిపురంలో చిన్నబ్బ, రోజా దంపతులు ఉంటున్నారు. ఏడాది కిందట రోజా మృతిచెందింది. వీరి కుమార్తె గీతాంజలి(15) జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివింది. ఐదు నెలల కిందట జులాయిగా తిరిగే నవీన్‌తో ఈమెకు పరిచయం ఏర్పడింది. ఈ విషయం తెలిసి చిన్నబ్బ కుమార్తెను మందలించి మరో అద్దె ఇంట్లోకి మారాడు. అయినా నవీన్ ఫోన్ చేసి గంజాయి మత్తులో ఆమెను బెదిరించేవాడు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం నవీన్, అతడి తల్లి సుశీల, సోదరి కన్నెమ్మ బాలిక ఇంటికి వచ్చి దుర్భాషలాడారు. మనస్తాపానికి గురైన ఆమె ఇంట్లో ఉరేసుకుంది. బాలిక నానమ్మ ఆదిలక్ష్మి గుర్తించి కేకలు వేయడంతో స్థానికులు గడియ పగులగొట్టి లోపలకు వెళ్లారు. అప్పటికే ఉరికి వేలాడుతున్న గీతాంజలిని రుయాస్పత్రికి తరలించగా, మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తన కుమార్తె గీతాంజలిని ఆత్మహతకు ప్రేరేపించి వేధించిన నవీన్, అతడి కుటుంబీకులపై చర్యలు తీసుకోవాలని చిన్నబ్బ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాయినాధ్‌చౌదరి తెలిపారు. నవీన్ నిత్యం గంజాయి తీసుకుని జులాయి తిరిగేవాడని ఎస్ఐ తెలిపారు. గీతాంజలి మృతదేహానికి పోస్టుమార్టం చేసి కుటుంబసభ్యులకు అప్పగించారు. నవీన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

రెండో షెడ్యూల్‌లో ఎన్సీ 24




నాగచైతన్య కథానాయకుడిగా కార్తీక్ దండు దర్శకత్వంలో ఓ చిత్రం (ఎన్సీ-24- వర్కింగ్ టైటిల్) తెరకెక్కుతోంది. బీవీఎస్ఎన్ ప్రసాద్, సుకుమార్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోంది. శుక్రవారం హైదరాబాద్‌లో రెండో షెడ్యూల్‌ను ప్రారంభించినట్లు యూనిట్ తెలిపింది. నెలరోజుల పాటు సాగే ఈ షెడ్యూల్‌లో నాగచైతన్యతో పాటు ప్రధాన తారాగణం అంతా పాల్గొంటోంది. ఈ సందర్భంగా యూనిట్ నాగచైతన్య పోస్టర్‌ను విడుదల చేసింది. ఒక చేతిలో గొడ్డలి, మరో చేతిలో తాడుతో మాస్ లుక్‌లో నాగచైతన్య ఆకట్టుకున్నారు. ఈ చిత్రానికి అజనీష్ బి లోక్‌నాథ్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: రఘుల్ ధరుమాన్

వైరల్ వయ్యారి



గాలి జనార్దన్ రెడ్డి తనయుడు కిరీటి రెడ్డి కథానాయకుడిగా పరిచయమవుతున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'జూనియర్'. రాధాకృష్ణ దర్శకత్వంలో వారాహి చలనచిత్రం బేనర్‌పై రజనీ కొర్రపాటి నిర్మించారు. శ్రీలీల కథానాయిక. ఈ నెల 18న ఈ చిత్రం విడుదలవుతోంది. చిత్ర బృందం ప్రచార కార్యక్రమాల్లో వేగం పెంచింది. 'జూనియర్' నుంచి రెండో పాటను యూనిట్ శుక్రవారం విడుదల చేసింది. 'వైరల్ వయ్యారి' అంటూ సాగే ఈ గీతానికి కల్యాణ్ చక్రవర్తి సాహిత్యం అందించారు. దేవి శ్రీ ప్రసాద్ స్వరాలందించడంతో పాటు హరిప్రియతో కలసి ఆలపించారు. దేవి సంగీతంతో పాటు కిరీటి రెడ్డి, శ్రీలీల స్టెప్పులు ఈ పాటకు ప్రత్యేకాకర్షణగా నిలిచాయి. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: కె. కె. సెంథిల్ కుమార్

పల్లెటూరి సరదాలు



మనోజ్ చంద్ర, మోనిక టి, ఉషా బోసెల ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతోన్న గ్రామీణ నేపథ్య వినోదాత్మక చిత్రం 'కొత్తపల్లిలో ఒకప్పుడు'. నటి, నిర్మాత ప్రవీణ పరుచూరి ఈ సినిమాతో దర్శకురాలిగా పరిచయం అవుతున్నారు. రానా దగ్గుబాటి సమర్పణలో గోపాల కృష్ణ పరుచూరి, ప్రవీణ పరుచూరి నిర్మిస్తున్నారు. ఈనెల 18న థియేటర్లలో విడుదలవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ ఈ చిత్ర టీజర్‌ని విడుదల చేశారు. మనోజ్ చంద్ర రికార్డ్ డ్యాన్స్ స్టూడియోని నడుపుతున్న యువకుడిగా కనిపించాడు. పల్లెటూరి జీవితాన్ని, సరదాలని అద్భుతంగా ఈ చిత్రంలో చూపించబోతున్నామని చిత్రబృందం పేర్కొంది.

జెన్కో జోరు.. రికార్డు స్థాయిలో విద్యుదుత్పత్తి

- మార్కెట్లో కొనకుండానే కరెంటు సరఫరా
- అందుబాటులోకి శ్రీశైలం జలవిద్యుత్
- మొత్తం 199.498 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి
- డిమాండ్‌కు సరిపడా అందడంతో.. బయట కొనుగోలు చేయని డిస్కంలు

అమరావతి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): బహిరంగ మార్కెట్లో విద్యుత్ కొనుగోళ్లకు వెళ్లకుండానే.. డిమాండ్‌కు సరిపడా కరెంటును ఏపీ జెన్‌కో ఉత్పత్తి చేస్తోంది. శుక్రవారం రికార్డు స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేసింది. రాష్ట్ర విద్యుదుత్పత్తి సంస్థలు అందించిన సమాచారం మేరకు.. శుక్రవారం 199.498 మిలియన్ యూనిట్లను అవి ఉత్పత్తి చేశాయి. దీంతో.. మార్కెట్లో ఒక్క యూనిట్‌ను కూడా కొనుగోలు చేయకుండా డిస్కంలు డిమాండ్‌ను తట్టుకున్నాయి. శుక్రవారం ఏపీ జెన్కో ఆధ్వర్యంలోని థర్మల్ విద్యుత్కేంద్రాల్లో 78.015 మిలియన్ యూనిట్లు, జలవిద్యుత్కేంద్రాల్లో 19.869 మిలియన్ యూనిట్లు, జెన్కో సోలార్ కేంద్రాల్లో 1.588 మిలియన్ యూనిట్లు, సెంట్రల్ జనరేటింగ్ స్టేషన్లు 10.938 మిలియన్ యూనిట్లు, ఐపీపీ (సెయిల్, హెచ్ఎన్‌పీసీఎల్) 37.945 మిలియన్ యూనిట్లు, పవన విద్యుత్ 57.946 మిలియన్ యూనిట్లు, ప్రైవేటు సోలార్ 18.383 మిలియన్ యూనిట్లు, అంతర్రాష్ట్ర ఉత్పత్తి 1.206 మిలియన్ యూనిట్లు.. మొత్తం 199.498 మిలియన్ యూనిట్లను విద్యుత్ సంస్థలు అందించాయి. డిమాండ్ కూడా అంతే ఉండడంతో డిస్కంలు మార్కెట్లో కొనుగోలు చేయలేదు. శ్రీశైలం కుడిగట్టు జలవిద్యుత్కేంద్రంలో ఉత్పత్తి కొనసాగుతోంది. 720 మెగావాట్లు అందుబాటులోకి వచ్చింది. కృష్ణపట్నం థర్మల్ మూడో యూనిట్ నుంచి 750 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అయింది. వీటితో కలిపే 199.498 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి జరిగింది. ఇంకోవైపు.. థర్మల్ విద్యుదుత్పత్తి బాగానే ఉన్నందున ప్లాంట్లలో బొగ్గు నిల్వలను ఇంకా పెంచాలని విద్యుత్ రంగ నిపుణులు చెబుతున్నారు. వీటీపీఎస్‌లో రోజుకు 41,500 మెట్రిక్ టన్నుల బొగ్గు అవసరం కాగా.. 13 రోజులకు సరిపడా 5,48,586 టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయి. ఆర్‌టీపీపీలో రోజుకు 28,500 టన్నులు అవసరం కాగా.. రెండున్నర రోజులకు సరిపడా 74,549 టన్నుల నిల్వలే ఉన్నాయి. కృష్ణపట్నం థర్మల్ ప్లాంట్‌లో రోజుకు 29,000 టన్నుల బొగ్గు అవసరం కాగా.. భారీగా 2,30,020 టన్నుల నిల్వలు ఉన్నాయి. సెయిల్‌లో రోజుకు 20,000 మెట్రిక్ టన్నుల బొగ్గుకు గాను 4,72,705 టన్నుల నిల్వలు ఉన్నాయి.

బకాయిలతో డిస్కంలు విలవిల..

రూ.7,562.48 కోట్ల బకాయిలు రాష్ట్ర డిస్కంలను భయపెడుతున్నాయి. నెలలోపే విద్యుత్ బకాయిలను తీర్చాలన్న నిబంధనలను దాటిన మొత్తాలు రూ.3,513.34 కోట్లు ఉన్నాయి. ఈ నెలలో చెల్లించాల్సిన బకాయిలు రూ.4,049.14 కోట్లు. ఈ మొత్తాలను తీర్చడానికి నిధుల కోసం డిస్కంలు అన్వేషణ ప్రారంభించాయి. అప్పులు తీర్చడానికి కొత్త అప్పులు చేయడానికి సిద్ధమవుతున్నాయి.

ఇక 'స్మార్ట్' రేషన్ కార్డులు

- ఏటీఎం కార్డుల్లా రూపకల్పన
- క్యూఆర్ కోడ్‌తో వివరాలు ప్రత్యక్షం
- పాత కార్డుల స్థానంలో కొత్త కార్డులు
- నేతల ఫొటోలు లేకుండా ముద్రణ
- ప్రభుత్వ అధికారిక చిహ్నం, లబ్ధిదారు ఫొటో ఉండేలా చర్యలు
- సిద్ధమవుతున్న కొత్త స్మార్ట్ కార్డులు
- వచ్చే నెలలో పంపిణీకి ఏర్పాట్లు



అమరావతి, జూలై 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రేషన్ కార్డుల రూపుమారుతోంది. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో తయారవుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం కార్డులకు పార్టీ రంగులు పులిమేసి.. వాటిపై ఒకవైపు జగన్ బొమ్మ, మరోవైపు వైఎస్ రాజశేఖరరెడ్డి బొమ్మను ముద్రించి పంపిణీ చేసింది. ఇప్పుడు వాటికి స్వస్తి చెప్పి.. రాజకీయ పార్టీల రంగులు లేకుండా, నేతల బొమ్మలు ముద్రించకుండా కొత్త కార్డులను రూపొందిస్తున్నారు. పాత వాటి స్థానంలో ఈ కొత్త కార్డులు జారీ చేయడంతో పాటు ఇకపై కొత్తగా మంజూరు చేసే కార్డులన్నీ కూడా స్మార్ట్ కార్డులుగానే ఉండనున్నాయి. బ్యాంకు ఏటీఎం కార్డు తరహాలో క్యూఆర్ కోడ్‌తో ఈ స్మార్ట్ రేషన్ కార్డును రూపొందిస్తున్నారు. ఈ కార్డుల జారీకి పౌరసరఫరాల శాఖ ఇప్పటికే కసరత్తును పూర్తి చేసింది. స్మార్ట్ రేషన్ కార్డుపై ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వ అధికారిక చిహ్నం, మరోవైపు కార్డుదారు (కుటుంబ పెద్ద) ఫోటో ఉంటాయి. ఆ రేషన్ కార్డు నంబరు, రేషన్‌షాపు నంబరు తదితర వివరాలుంటాయి. కార్డు వెనుకవైపు లబ్ధిదారు కుటుంబ సభ్యుల వివరాలుంటాయి. ఈ స్మార్ట్ రేషన్ కార్డును రేషన్ డీలర్ల వద్ద ఉండే ఈ-పోస్ యంత్రాల సహాయంతో స్కాన్ చేస్తే ఆ కుటుంబానికి సంబంధించిన వివరాలతో పాటు రేషన్ సరుకుల వినియోగానికి సంబంధించిన పూర్తి సమాచారం ప్రత్యక్షమవుతుంది. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించే ఈ కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల ముద్రణ కోసం ఏపీటీఎస్ ద్వారా టెండరు ప్రక్రియ పూర్తి చేశారు. ప్రస్తుతం ముద్రణ దశలో ఉన్న కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను వచ్చే నెలలో పంపిణీ చేసేందుకు పౌరసరఫరాలశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

2 లక్షల కుటుంబాలకు కొత్తగా లబ్ధి

రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం 1.46 కోట్లకుపైగా కుటుంబాలకు రేషన్ కార్డులు ఉన్నాయి. వైసీపీ హయాంలో అర్హతలున్న నవదంపతులు, పేదలు రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్నా అప్పటి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో లక్షల సంఖ్యలో దరఖాస్తులు మూలనపడి ఉన్నాయి. అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వం.. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్రంలో అర్హులైనవారందరికీ కొత్త రేషన్ కార్డులను మంజూరు చేసింది. దీంతోపాటు తల్లిదండ్రుల నుంచి వేరుపడిన వారికి స్ప్లిట్ కార్డులు, ఉన్న రేషన్ కార్డులలో సభ్యుల చేర్పులు, తొలగింపులు, చిరునామాల మార్పులకు అవకాశం కల్పిస్తూ గత మే నెలలో దరఖాస్తులను స్వీకరించిన సంగతి తెలిసిందే. దీంతో ప్రతి జిల్లా నుంచి లక్షలాదిగా వచ్చిపడిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను యుద్ధప్రాతిపదికన పూర్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కొత్త రేషన్ కార్డుల కోసం 1,47,187 మంది దరఖాస్తులు చేసుకోగా.. వారిలో 89,864 మందికి కొత్త కార్డులు మంజూరు చేశారు. 38,046 మంది దరఖాస్తులను వివిధ కారణాలతో తిరస్కరించారు. కుటుంబ విభజన (స్ప్లిట్) కార్డుల కోసం 1,43,745 మంది దరఖాస్తు చేసుకోగా.. వారిలో 1,09,787 మందికి కొత్త కార్డులు మంజూరు చేశారు. 20,403 దరఖాస్తులను తిరస్కరించారు. ఇలా కొత్తగా మంజూరు చేసిన దాదాపు 2 లక్షల కొత్త రేషన్ కార్డులలోని లబ్ధిదారులకు సెప్టెంబరు నెల నుంచి రేషన్ సరుకులు పంపిణీ చేసే అవకాశం ఉంది. కొత్తగా వచ్చిన కార్డులతో రాష్ట్రంలో మొత్తం రేషన్ కార్డుల సంఖ్య 1.48 కోట్లకు చేరింది.